




ESTD: 1999
www.voodayam.com

# వుదయం






కరీంనగర్ | 21-04-2026 మంగళవారం | సంపుటి : 14 | సంచిక :132 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on

## ఇరాన్‌తో ఒప్పందం ఈ రోజే

రెండో విడత చర్చల కోసం
ఇస్లామాబాద్‌కు జెడి వాన్స్,
స్టీవ్ విట్కాఫ్ లను పంపించిన
తరువాత ట్రంప్ ప్రకటన



**వుదయం డెస్క్, ఏప్రిల్ 20 :** సంఘర్షణను ముగించే లక్ష్యంతో జరిపే రెండో విడత చర్చల కోసం, ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్, ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్, సలహాదారు జారెడ్ కుష్నర్‌లతో కలిసి ఇస్లామాబాద్‌కు బయలుదేరారని పేర్కొంటూ, ఇరాన్‌తో ఒక ఒప్పందం "ఈ రోజే" కుదిరే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం తెలిపారు.ఈ పరిణామాలను మొదటగా నివేదించిన న్యూయార్క్ పోస్ట్, ఫాక్స్ న్యూస్ కథనాల ప్రకారం, అమెరికాతో జరగబోయే కొత్త విడత చర్చలకు హాజరయ్యే ప్రణాళికలేవీ తమకు లేవని ఇరాన్ ఇంతకుముందే ప్రకటించినప్పటికీ, ఆ ప్రతినిధి బృందం మరికొన్ని గంటల్లోనే అక్కడ చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, నూర్ ఖాన్ వైమానిక స్థావరంలో ఒక అమెరికన్ విమానం దిగిందని, అయితే అందులో ఉన్నవారి వివరాలు తెలియరాలేదని రెడ్‌బాక్స్ గ్లోబల్ ఇండియా, అల్– అరేబియా వార్తా సంస్థలు పేర్కొన్నాయి. రావల్పిండిలో ఒక అమెరికా సైనిక విమానం ఉన్నట్లుగా కనిపిస్తున్న ఒక వీడియోను కూడా అల్– అరేబియా విడుదల చేసింది. అయితే, ఆ వీడియో ప్రామాణికతను న్యూస్ 18 స్వతంత్రంగా ధృవీకరించలేకపోయిందని ఆ ఛానెల్ పేర్కొంది.

# కాళేశ్వరం దోషులను వదిలిపెట్టం

## డబ్బు కోసమే రీడిజైనింగ్



- బీజేపీని అడ్డుపెట్టుకుని కేసుల నుంచి బయట పడతామంటే చూస్తూ ఊరుకోం
- సీబీఐ విచారణ నుంచి తప్పించుకునేందుకే హరీశ్ రావు ఢిల్లీ పర్యటన
- కాళేశ్వరం పునరుద్ధరణపై చిత్తశుద్ధితో ఉన్నాం
- సాంకేతిక నిపుణులు, మూడు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో చర్చించాం: సీఎం



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి) :** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ నుంచి తప్పించుకునేందుకే మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీకి పరుగెత్తారని సీఎం రేవంత్ రెడ్డి ధ్వజమెత్తారు. జడ్జిమెంట్ ప్రకటించకముందే న్యాయవాదులను కలవాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆరోపించారు. కేసీఆర్, హరీష్ రావులను జైల్లో పెడతామని గతంలో బీజేపీ నేతలు ప్రగల్భాలు పలికారని సీఎం విమర్శించారు. తాము రెండుసార్లు సీబీఐకి లేఖలు రాసినా కేంద్రం స్పందించడం లేదని ఆయన మండిపడ్డారు. బీజేపీని అడ్డుపెట్టుకుని కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కాళేశ్వరం దోషులను కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. తాము నెల రోజుల ముందే మేడిగడ్డ పర్యటన ఖరారు చేసుకున్నామని సీఎం చెప్పారు.

మిగతా 2లో

### 2029లో మేమే

మాదిగ బిడ్డ అడ్లూరికి మంత్రి పదవి ఇస్తే జీవన్ రెడ్డి ఓర్వలేకపోయారు
బహిరంగ సభలో ముఖ్యమంత్రి

2

## పేదలను, రైతులను

# వేధిస్తున్నారు

- పాలన వదిలేసి కెసిఆర్ చావాలని కోరుకుంటున్నారు
- వెయ్యి జన్మలెత్తినా నేను చావను
- రైతు బంధు, దళిత బంధును గాలికి వదిలేసి రైతులు, పేదలను ఏడిపిస్తున్నారు
- తెలంగాణ వ్యతిరేక శక్తులతో ప్రభుత్వం చేతులు కలిపింది
- అధికారంలోకి మేము రాగానే హైడ్రాను రద్దు చేస్తాం

**బిఆర్ఎస్ లో చేరిన జీవన్ రెడ్డి**



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి) :** ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. చంద్రబాబు హయాంలో కరెంట్ ఛార్జీలు పెంచితే నిరసన తెలిపిన వారిని కాల్చి చంపిన ఘటన తనను ఉద్యమం వైపు నడిపించిందని చెప్పారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు చంద్రబాబు డైరెక్షన్‌లో నే పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ గడ్డపై గంజి కేంద్రాలు నడిచిన రోజులు చూశామని చెప్పారు. కరెంట్ కోసం బషీర్‌బాగ్‌లో మన పిల్లలు ప్రాణాలిస్తుంటే చలించి ఉద్యమానికి వచ్చానన్న కేసీఆర్..తనను బాడీ షేమింగ్ చేసినా, హేళన చేసినా పక్షిలా రాష్ట్రమంతా తిరిగి తెలంగాణ సాధించానని వెల్లడించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తులం బంగారం, స్కూటీలు, పెంచిన పెన్షన్లు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయని కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు, దళితబంధులను గాలికి వదిలేసి రైతులను, పేదలను ఏడిపిస్తున్నారని మండిపడ్డారు.

మిగతా 2లో

# లోయలో పడిన బస్సు

## కాశ్మీర్‌లో 21 మంది మృతి

### 60 మందికి గాయాలు



**వుదయం డెస్క్, ఏప్రిల్ 20 :** జమ్మూ కాశ్మీర్‌లోని ఉధంపూర్‌లో సోమవారం ఒక పాసింజర్ బస్సు కొండపై నుంచి కిందకు దొర్లిపడటంతో కనీసం 21 మంది మరణించగా, మరో 60 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఉదయం సుమారు 10 గంటల సమయంలో, కాగోర్ట్ గ్రామం సమీపంలో బస్సు ఒక మలుపును దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆ వాహనం ఊధంపూర్ వైపు వెళ్తోంది. స్థానిక వాసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు శకలాల మధ్య చిక్కుకున్న క్షతగాత్రులను వారు బయటకు తీశారు. బాధితులను తరలించడానికి, ప్రమాద స్థలాన్ని ఖాళీ చేయడానికి పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఆ తర్వాత ఈ సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. గాయపడిన 20 మందిని రక్షించి, జిఎంసి ఉధంపూర్‌కు తరలించినట్లు అధికారులు ఇంతకుముందు తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారిని ప్రత్యేక చికిత్స నిమిత్తం జిఎంసి జమ్మూకు తరలిస్తున్నారు. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటన పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

మిగతా 2లో

# జపాన్ లో తీవ్ర భూకంపం

## రిక్టర్ స్కేల్‌పై 7.4 తీవ్రత రికార్డు

## సునామీ భయంతో బుల్లెట్ రైళ్ల నిలిపివేత



**వుదయం డెస్క్, ఏప్రిల్ 20 :** సోమవారం జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.4 తీవ్రతతో శక్తిమంతమైన భూకంపం సంభవించింది. దీనితో జపాన్ వాతావరణ శాఖ సునామీ హెచ్చరికలను జారీ చేసింది. దీనితో ఆ ప్రాంతంలో బుల్లెట్ రైలు సేవలను నిలిపివేశారు. అధికారులు అణుకేంద్రాలపై ఉండగల సంభావ్య ప్రభావాలను అంచనా వేస్తున్నారు. తూర్పు సాన్‌రికు మియాకో ప్రాంతానికి, హొక్కియాడో, ఇవాడే జిల్లాకు సునామీ హెచ్చరికలు చేశారు. ఇవాటే ప్రిఫెక్చర్‌లోని సాన్‌రికు తీరానికి దూరం గా భూకంపం సంభవించిందని జపాన్ వాతావరణ సంస్థ తెలిపింది. అత్యంత తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలలో జపాన్ 0–7 భూకంప తీవ్రతా మాపకంపై 5కు పైగా తీవ్రత నమోదైంది. జాతీయ ప్రసార సంస్థ ఎన్ హెచ్‌కె ప్రకారం, హొక్కైడో, ఆమోరి, మియాగి మరియు ఫుకుషిమా ప్రిఫెక్చర్లకు కూడా సునామీ హెచ్చరిక జారీ చేయబడింది. భూకంపం కారణంగా టోక్యో, షిన్–అమోరి స్టేషన్ల మధ్య సర్వీసులను నిలిపివేసినట్లు తోహోకు షింకన్సెన్ ఆపరేటర్ తెలిపారు. ఫుకుషిమా దైచి, దైని అణు విద్యుత్

మిగతా 2లో

## చంచల్ గూడ నుంచి ఇద్దరు ఖైదీలు పరార్

### కోర్టుకు తరలిస్తుండగా తప్పించుకున్న రిమాండ్ ఖైదీలు

**హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఎఎంస్) :** హైదరాబాద్ లో పోలీసుల భద్రతా వైఫల్యం బట్టబయలైంది. చంచల్‌గూడ జైలుకు చెందిన ఇద్దరు ఖైదీలు పోలీసుల కళ్లుగప్పి సినిమా ఫక్కీలో తప్పించుకోవడం సంచలనం సృష్టించింది. కోర్టు విచారణ నిమిత్తం వారిని వాహనంలో తరలిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఇద్దరిని సోమవారం ఉదయం పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టేందుకు పోలీసులు వాహనంలో తీసుకువెళ్లారు. అయితే, ట్రాఫిక్ సిగ్నల్ వద్ద వాహనం ఆగిన సమయంలో భద్రతా సిబ్బంది ఏమరపాటుగా ఉండటాన్ని గమనించిన ఖైదీలు, చాకచక్యంగా వాహనం నుండి దూకి పరారయ్యారు. ఖైదీలు తప్పించుకున్న విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

మిగతా 2లో

## ప్రధాని ప్రారంభించాల్సిన

# రిఫైనరీలో ప్రమాదం

### రాజస్థాన్ బలోత్రా జిల్లాలో చలరేగిన మంటలు

ప్రారంభోత్సవం వాయిదా ● ప్రాణ నష్టం జరుగలేదు

**వుదయం డెస్క్, ఏప్రిల్ 20 :** రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఉన్న పచ్‌పద్ర రిఫైనరీలో సంభవించిన అగ్నిప్రమాదం కారణంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరగాల్సిన దాని ప్రారంభోత్సవం వాయిదా పడిందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సోమవారం తెలిపింది. సిడియు (ముడి చమురు శుద్ధి విభాగం) సమీపంలో చెలరేగిన ఈ మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని సమాచారం. ఈ శుద్ధి కర్మాగారాన్ని ఏప్రిల్ 21న జాతికి అంకితం చేయాలని నిర్ణయించినప్పటికీ, ప్రస్తుతం ఆ కార్యక్రమం వాయిదా పడింది. సవరించిన తేదీని తదనంతరం ప్రకటిస్తామని మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే, ఈ ఘటనకు గల కారణాలను నిర్ధారించడానికి, అవసరమైన నివారణ చర్యలు చేపట్టడానికి ఒక విచారణను ప్రారంభించినట్లు పేర్కొంది. మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక వాహనాలు హుటాహుటిన చేరుకుంటుండగా, ఆ ప్రదేశం నుండి దట్టమైన పొగ వెలువడుతున్న వీడియోలు ఈ రోజు ఉదయం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన ఈ రిఫైనరీ, రూ. 79,450 కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మించిన భారతదేశపు మొట్టమొదటి గ్రీన్‌ఫీల్డ్ సమీకృత రిఫైనరీ– కమ్– పెట్రోకెమికల్ కాంప్లెక్స్. ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ ఆ ప్రదేశాన్ని

మిగతా 2లో

# మాట తప్పను



- నా వాగ్దానాలు ఉత్తుత్తివి కావు
- భారీ రోడ్ షోలో టివికె అధినేత విజయ్

**చెన్నై, ఏప్రిల్ 20 (వుదయం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎండలకన్నా, ఎక్కువగా ప్రచార హోరు రాజుకుంటోంది. ప్రధాన పార్టీలన్నీ కూడా తాడోపేడో అన్నస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ఆనవాయితీగా వస్తున్న రెండు పార్టీల మధ్య పోటీ కాకుండా ఈసారి ముక్కోణపు పోటీ కావడంతో ఈసారి ఎన్నిక ఉత్కంఠతో సాగనుంది. తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు విజయ్ సక్కు పొన్నేరి అసెంబ్లీ నియోజకవర్గంలోని పంచట్టి ప్రాంతంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న నటుడు విజయ్‌కు తమ మద్దతు తెలిపేందుకు ప్రజలు పోటెత్తారు. అయితే, ఈ రోడ్‌షోకు హాజరైన టివికె మద్దతుదారులు ఎక్కువ సేపు ఎండలో ఉండటం వల్ల స్పృహ తప్పి పడిపోయారు. నటుడిగా ఉండి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన విజయ్, తన పార్టీ టివికె తరపున ఎన్నికల బరిలో దిగడానికి సిద్ధమయ్యారు. ఇది ఎన్నికల పోరును త్రికోణ పోటీగా మార్చే అవకాశం ఉంది. తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గంలో, విజయ్ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఎస్. ఇరుదయరాజ్‌పై పోటీ చేస్తున్నారు. అలాగే, ఆయన పెరంబూరు నియోజకవర్గం నుండి కూడా పోటీ చేస్తున్నారు, అక్కడ ఆయన డిఎంకె ఎమ్మెల్యే ఆర్.డి. శేఖర్‌ను ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్ 23న జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం అందిస్తామని, అలాగే వార్షిక ఆదాయం రూ. 5 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు చెందిన ప్రతి

మిగతా 2లో

## మీ పిల్లలు నాయకులు కావచ్చా, మా వారసులు ప్లీడర్లు కాకూడదా?

### కేజ్రీవాల్ కు జస్టిస్ సూటి ప్రశ్న



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (వుదయం) :** ఢిల్లీ ఎక్సైజ్ విధానం కేసులో సోమవారం తీర్పు ఇస్తూ, తన కుటుంబం గురించి ఆప్ అధినేత కేజ్రీవాల్ చేసిన వ్యాఖ్యలపై జస్టిస్ స్వర్ణ కాంత శర్మ తీవ్రంగా స్పందించారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను, అలాగే వ్యక్తిగత విషయాలను న్యాయస్థాన విచారణల నుండి దూరంగా ఉంచాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. న్యాయమూర్తి పిల్లలు కేంద్ర ప్రభుత్వ న్యాయవాదులుగా ఎంప్యానెల్ అయ్యారని, ప్రాసిక్యూటింగ్ ఏజెన్సీ అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ద్వారా వారికి గణనీయమైన పని లభిస్తోందని మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఒక అఫిడవిట్‌లో పేర్కొన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ఈ ఆందోళనలకు స్పందిస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రస్తుత కేసుకు ఎలాంటి సంబంధం లేదని కోర్టు పేర్కొంది. ఆమె బంధువులెవరూ తన కోర్టుకు హాజరు కాలేదని గానీ, ఢిల్లీ ఎక్సైజ్ విధానానికి సంబంధించిన విషయాలతో వారికి సంబంధం లేదని కోర్టు స్పష్టం చేసింది. ఒక రాజకీయ నాయకుడి భార్య రాజకీయ నాయకురాలు కాగలిగినప్పుడు, ఒక రాజకీయ నాయకుడి పిల్లలు రాజకీయ నాయకులు కాగలిగినప్పుడు, ఒక న్యాయమూర్తి పిల్లలు న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించలేరని ఎలా చెప్పగలరు? ఇది న్యాయమూర్తుల కుటుంబ ప్రాథమిక హక్కులను హరించడమే అవుతుందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

మిగతా 2లో



## గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు

### ఫార్మా పరిశ్రమలో పేలిన రియాక్టర్


### భయాందోళనలో సమీప ప్రజలు

**సంగారెడ్డి, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి) :** సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా రియాక్టర్ పేలింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పలు ఫైర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి.

మిగతా 2లో

# భూధరలకు రెక్కలు?

- తెలంగాణలో పెరగనున్న రిజిస్ట్రేషన్ మార్కెట్
- విలువ వ్యవసాయ భూముల విలువ గరిష్టంగా 300 శాతం
- ఓఆర్ఆర్ పరిసరాల్లోని ప్లాట్ల రేట్లు మూడింతలు
- అపార్ట్‌మెంట్ ఫ్లాట్ల ధరల పెంపు స్వల్పం
- కమర్షియల్ స్పేస్ రేట్లు తగ్గింపు సర్కార్ చేతికి ప్రతిపాదనలు
- రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం తర్వాత
- అమల్లోకి కొత్త ధరలు భారీగా పెరగనున్న ప్రభుత్వ ఆదాయం
- రియల్ రంగంలో పారదర్శకత



**హైదరాబాద్, ఏప్రిల్ 20 (ఎఎంస్) :** తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగానికి ఊపునిచ్చేలా రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ భూములు, నివాస స్థలాల మార్కెట్ విలువను భారీగా పెంచేందుకు కసరత్తు చేసింది. వచ్చే నెలలో లేదా జూన్ నుంచి ఈ పెరిగిన ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

మిగతా 2లో



## గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

ఫరూఖ్ నగర్ ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అంజయ్య యాదవ్ చేయూత... మొగిలిగిద్దలో ఘనంగా కోట మైసమ్మ బొడ్రాయి పండుగలుఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో ఘనంగా జరుగుతున్న కోట మైసమ్మ మరియు బొడ్రాయి పండుగ ఉత్సవాలలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. సంప్రదాయబద్ధంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్న ఈ పండుగలో గ్రామస్తులతో కలిసి ఆయన పాల్గొని, దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల ఆరోగ్యం, ఐశ్వర్యం, శాంతి-సౌభాగ్యాలు కలగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గ్రామ అభివృద్ధి నిరంతరం కొనసాగాలని, యువతకు మంచి భవిష్యత్తు కలగాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమావిజయవంతమైన నిర్వహణ కోసం తనవంతు సహాయంగా లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. గ్రామ పెద్దలు,
ఉత్సవ కమిటీ సభ్యులు ఆయన సేవా భావాన్ని కొనియాడుతూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, సర్పంచులు బుగ్గ కృష్ణయ్య, గీత వీరేశం, జెమిని బాయి అమృ నాయక్, కృష్ణవేణి నరేందర్, మాజీ సర్పంచ్ బద్ధుల శ్రీశైలం తదితరులు, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజావాణికి(48)ఫిర్యాదులు



రంగారెడ్డి జిల్లా ,ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (48) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ శాఖ-08 , ఇతర శాఖలు 40 , మొత్తం 48 దరఖస్తులు అందాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం చేయకుండా ఉండకూడదని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నీ సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి(రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రేశంలో బసవ జయంతి సంబరాలు



పటాంచేరు ,ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

నియోజకవర్గం ఇంద్రేశం మున్సిపాలిటీలో 893వ బసవ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, మరియు పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.జగద్గురు బసవేశ్వరుని జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించి, ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.
ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, బసవన్న గారి బోధనలు సమాజానికి మార్గదర్శకమని, సమానత్వం, న్యాయం, మరియు సద్భావనను పెంపొందించడంలో ఆయన సందేశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.వేడుకల లో భాగంగా భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు, బసవన్న గారి జీవితం, ఆశయాలపై ప్రత్యేక ప్రసంగాలు నిర్వహించారు. యువత చురుకుగా పాల్గొని కార్యక్రమ నిర్వహణలో తమ వంతు సహకారం అందించారు.అదేవిధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. మహిళలు, వృద్ధులు, పిల్లలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా మార్చారు.ఈ కార్యక్రమంలో ఇంద్రేశం మున్సిపల్ వైస్ చైర్మన్ పట్లోళ్ల హరీష్ రెడ్డి గారు, కౌన్సిలర్లు అంతిరెడ్డి గారు, దుర్గారెడ్డి గారు, శివకుమార్ గౌడ్ గారు, శ్రీనివాస్ గౌడ్ గారు పాల్గొన్నారు. అలాగే లింగాయత సమాజ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల కార్యక్రమ నివేదిక

హైదరాబాద్ ,ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

ఈ రోజు ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి ఫిర్యాదుల కార్యక్రమం క్రింది అధికారుల సమక్షంలో నిర్వహించబడింది శ్రీ ఆర్.వి. కర్ణన్, IAS, కమిషనర్, శ్రీ కె.సత్యనారాయణ, అదనపు కమిషనర్ (అడ్మిన్),
శ్రీ ఎన్. రవి కిరణ్, అదనపు కమిషనర్ (హెల్త్), * శ్రీ సహదేవ్ రత్నాకర్, చీఫ్ ఇంజనీర్ శ్రీ కె. శ్రీనివాస్, చీఫ్ సిటీ ప్లానర్* శ్రీమతి రమా దేవి, భూస్వాధీనం విభాగం, శ్రీ వి. వెంకటేశ్వర్ రావు, డైరెక్టర్ * శ్రీ ఎస్. జయంత్, జాయింట్ కమిషనర్ (అడ్మిన్), శ్రీ జి. రాజనీకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ (రెవెన్యూ),

జోన్ వారీగా అందిన ఫిర్యాదులు:
శంషాబాద్ జోన్: 12
రాజేంద్రనగర్ జోన్: 02
చార్మినార్ జోన్: 01
గోల్కొండ జోన్: 02
* ఖైరతాబాద్ జోన్: 01
* సికింద్రాబాద్ జోన్: 09
* ప్రధాన కార్యాలయం: 35
మొత్తం అందిన ఫిర్యాదులు: 62

# డక్కలి వారు కూడా జానపద కళాకారులే

- రాగ, తాళ లక్షణాలు తెలియక పోయినా లయబద్ధంగా పాట ఆట బిక్షమెత్తరు... మాదిగలే మా హక్కుగా భావిస్తారు

వికారాబాద్ ఏప్రిల్ 20 (వుదయం బ్యూరో)





ఆటపాటతో అలరించి పదముతో మురిపించి... మురిపించి.... కాలం తెలవకపోయినా లయబద్ధంగా పాట పాడుతూ ఆట ఆడుతూ... గ్రామాల్లో పాటలు పాడుతూ తిరుగుతూ.... ఊరికి దూరంగా పెంట కుప్పల దగ్గర జీవితం సాగిస్తూ.... పొట్ట కూడి కోసం బిక్షం ఎత్తకుండా.... మాదిగలే మా హక్కు అంటూ....వారి వద్దనే భోజనం చేస్తూ.... పురాతన కొన్ని కథలను కళ్ళకు కట్టినట్టు వినిపిస్తూ జీవితం కొనసాగిస్తున్న వారే దక్కలి కులస్తులు... వారి జీవితం ఎలా ఉంటుందో ఒకసారి ఈ వ్యాసం చదవండి.....మాదిగలకు, దక్కలి వారికి సోదర సంబంధం ఉన్నదని తెలిపే కథ జాంబపురాణంలో ఉన్నది. సృష్టి ఏర్పడటానికి ముందు అది ఏకోనారాయణమూర్తి అంశంతో జాంబవంతుడు సృష్టింపబడినాడు. అప్పటికి భూమ్యాకాశాలు ఏర్పడనందున సముద్రపు నీటిపై తేలుతూ ఉంటాడు. తర్వాత ఆదిశక్తి, త్రిమూర్తులు పుడతారు, శివపార్వతుల వివాహం కొరకు శివుని ఆజ్ఞపై జాంబవంతుడు తన ఇద్దరు కుమారులలో పెద్దవాడిని చంపి అతని అవయవాలతో విశ్వకర్మకు పనిముట్లు తయారు చేసి ఇచ్చాడు. చివరకు అన్ని అవయవాలుపోగా అతని డొక్క మిగులుతుంది. జాంబవంతుడు ఆ ఏడు వెన్నుపూసల డొక్కను తనయింటి ముందున్న పెంట కుప్పలపై పారవేసినాడు. పార్వతీ పరమేశ్వరులు అనుగ్రహించి ఆ డొక్కపై విభూతి వేసి సంజీవి పుల్ల మోపి బాలుని బ్రతికించారు. వానిని జాంబవంతుని ఇంట్లోకి తీసుకువస్తుండగా ఇంటి ముందు గల గరుడస్తంభం కూలి, ఏడు ద్వారాలకు అగ్గితగులుతుంది. అప్పుడు వీడు అక్కర లేదని పెంటకుప్పపై కూర్చోపెడతారు. అందువల్ల జాంబవంతునికి దక్కని వాడై డొక్కలో పుట్టిన దక్కలివాడైనాడు. కలియుగంలో దక్కలివానిగాను, మరో కుమారుడు మాదిగవాడుగాను పుట్టినారు. దక్కల్ వారు మాదిగ సమాజం నుండి భిక్షను సేకరిస్తారు. భిక్షను స్వీకరించడానికి ముందు, దక్కల్ వారు వంశవృక్షాలను మరియు జానపద కథలను చెప్పాలి. సాధారణంగా ఒక దక్కల్ వ్యక్తి ఒకటి లేదా రెండు రోజుల పాటు ఒక గ్రామాన్ని సందర్శిస్తారు. మాదిగలు వారికి ఆహారం, బహుమతులు మరియు డబ్బు ఇస్తారు. ప్రతిఫలంగా, దక్కల్ వారు కథలు చెప్పడం, జానపద గీతాలు పాడటం మరియు వంశవృక్షాలను పఠించడం ద్వారా వారిని అలరిస్తారు. దక్కల్ వారు అదే గ్రామానికి తిరిగి రావడానికి సాధారణంగా మరో సంవత్సరం పడుతుంది.వారి జీవితాలు ఎలా ఉంటాయి?దక్కల్ ప్రజలు ఆహారం కోసం పందులను, బరువులు మోయడానికి గాడిదలను పెంచి తమ ఆదాయాన్ని పెంచుకుంటారు. వారు వ్యాపారుల కోసం సరుకులను రవాణా చేయడానికి తమ గాడిదలను ఉపయోగిస్తారు. వారి మహిళలు కొన్నిసార్లు వ్యవసాయ కూలీలుగా పనిచేసి, తాము అల్లిన తాటాకు చాపలను అమ్మి డబ్బు సంపాదిస్తారు. వారు సాంప్రదాయకంగా సంచార జీవనం గడిపేవారు, కానీ కొందరు ఇప్పుడు స్థిరపడుతున్నారు.
తెలంగాణ ప్రాంతంలో మాదిగకులం వారు పూర్వకాలం నుండి తమ కులవృత్తులైన చర్మకార వృత్తి, దండోరా వృత్తి చేస్తూ జీవిస్తుండగా వీరిని ఆశ్రయించి జీవించే మొదటి ఆశ్రితకులం దక్కలి కులం వారు. దక్కలికులం వారు మాదిగలను తమ హక్కుదారులుగా భావిస్తారు. ఎందుకంటే మాదిగలకు, దక్కలి వారికి అతి దగ్గరసంబంధమున్నది. వీరిరువురు అన్నదమ్ములేనని జాంబపురాణం చెపుతుంది.
జాంబవంతునికి దక్కనివాడై దక్కలివానిగా పుట్టిన దక్కలి కులం వారికి మాదిగ వాడలో ప్రవేశం లేదు. ఊరి బైటనే నివసిస్తారు.
వీరిలో చాలా మందికి రెండు నిట్రాళ్లయిళ్లుండవు. పడుకోవడానికి మంచ ముండదు. తినడానికి కంచ ముండదు మట్టి చిప్ప మాత్రమే ఉంటుంది. కాలికి చెప్పు లుండవు, కప్పుకోవడానికి గొంగళి కూడా ఉండదు. వీరికి సివారు మీద బిక్షమెత్తుకునే హక్కులేదు. కేవలం మాదిగ కులం వారినే ఆశ్రయించి బ్రతుకుతారు.దక్కలి కళాకారులు మొదట జాంబపురాణ పటప్రదర్శన చేస్తూ కథాగానం చేసేవారు. కాని రాను రాను జనాకర్షణ కోసం కాలానుగుణంగా ముఖానికి రంగు పూసుకొని, వేషాలు వేసుకొని యక్షగాన పద్ధతిలో జంబపురాణాన్ని ప్రదర్శిస్తున్నారు.
జాంబ పురాణంలో మాదిగ వారి ఉపకులాలు మాలవారి ఉపకులాలను గూర్చి వివరించబడింది. ఇవే కాక సమాజంలోని అన్ని కులాల ప్రస్తావన, పుట్టుకలు సవివరంగా తెలుపబడినాయి. అయితే సమాజంలోని విశ్వకర్మ పనిముట్లే కాక అన్ని కులాలకు చెందిన ఆయా వృత్తులకు అవసరమైన పనిముట్లు, పరికరాలు, జాంబవంతుని కుమారుని అవయవాలతో తయారు చేయబడినాయని, అవి లభించడం వారికి మాదిగలు పెట్టిన భిక్షయే అని జాంబపురాణం చాటిచెప్పుతున్నది.
దక్కలి జానపద కళాకారులు తరతరాలు మన సంస్కృతిని పరిరక్షించడమే కాక అక్షర జ్ఞానం లేని గ్రామీణులు ఏనాడో, ఎక్కడో, ఎప్పుడో ఈ కళారూపాలను సృష్టించుకున్నారు. అలవోకగా, అశువుగా వచ్చిన పలుకులే పాటలుగా, పండుగ పబ్బాలలో ఆడే ఆటలే కళారూపాలయ్యాయి. అవే తరతరాలుగా నిలిచి ఉన్నాయి. కొత్త రూపాలను సంతరించుకున్నాయి. రాగ, తాళ లక్షణాలు తెలియక పోయినా లయబద్ధంగా పాడుతూ, ఆడుతూ అభినయంచేస్తూ ప్రజలను ముగ్ధులను చేస్తారు. వీరి జీవనంలోనే పటం కథల కళారూపాలు ప్రత్యేకమైన రూపును దిద్దుకున్నాయి. వారి జీవితాలతో పెనవేసుకున్నాయి. దక్కలి జానపద కళారూపాలు ముఖ్యంగా తెలంగాణా జానపద కళారూపాలు అతి ప్రాచీనమైనవి. ఇవి తెలంగాణ ప్రాంత గ్రామీణ ప్రజల సంతోషానికి, మానసిక చైతన్యానికి, వినోద విజ్ఞానాలకు భూమికగా నిలిచి ఉన్నాయి. దక్కలి జానపద కళారూపాలకు ఆ కథలు చెప్పే, కులాలను బట్టి, వరుసల ననుసరించి, కథా వస్తువులను బట్టి ఆయా పేర్లు వచ్చాయి. ఈ కళారూపాలు ఆయా ప్రాంతాల ప్రజల ఆశలకు, ఆలోచనా సరళికి ప్రతిరూపాలని చెప్పవచ్చు. అందువల్లనే ఈ కళారూపాలు ప్రజలందరిని ఆకట్టుకుంటున్నాయి.
తెలంగాణ దక్కలి కళాకారుల పటం కథలు తెలుగు వారి వైవిధ్య భరితమైన జీవితానికి, సంప్రదాయాలకు ప్రతిరూపాలు అన్ని జానపద కళారూపాలు కూడ. ఇవి అప్రయత్నంగా, సహజంగా ఆయా కళాకారుల నుండి రూపుదిద్దుకున్నప్పటికి వీటిలో సంగీత ముంటుంది. తాళం, లయ, నృత్యం, అభినయాలుంటాయి. వాద్యాల లయబద్ధమైన కలయిక, క్రమశిక్షణలుంటాయి. సామాజిక, రాజకీయ ఆధునిక పరిణామాలు ఎన్ని వచ్చినా పరంపరగా వస్తున్న ఈ కళారూపాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. మనకళలు, సంప్రదాయాలు ఇంత వరకు నిలిచాయంటే అది జానపద కళాకారుల గొప్పదనమే. జానపదం అంటే కేవలం పల్లెపాటలు అనే అభిప్రాయం ఒకనాడుండేది. ఈనాడు జానపద కళాకారుల పాటలు జానపద విజ్ఞానంలో ఒక భాగం. ఇది జానపద విజ్ఞాన పరిధి విస్తరించిన పరిణామ ఫలితమే. ప్రజల మధ్యనే స్వతఃసిద్ధంగా పుట్టి పెరిగిన కళారూపాలు కావటం వలన వీటికి జానపద కళారూపాలని పేరు వచ్చింది
దక్కలి బాలమ్మ
దక్కలి బాలమ్మ తెలంగాణ రాష్ట్రంలో పన్నెండు మెట్ల కిన్నెర గాయనిగా ప్రసిద్ధి చెందిన గాయకురాలు ఆమె వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మంబాపూర్ గ్రామంలో నివసించేది. ఆమె అట్టడుగు దళిత సామాజికవర్గంలో జన్మించింది. ఆమె తన 15 ఏళ్ల వయసులోనే కిన్నెర వాయిద్యాన్ని వాయిస్తూ జీవనాన్ని సాగించింది. ఆమె తన తండ్రి వద్ద ఈ విద్యను అభ్యసించింది. ఆ కాలంలో వారు గాడిదలపై ప్రయాణిస్తూ తమ కళను వివిధ గ్రామాలలో ప్రదర్శించేవారు.ఆమె భర్త మరణించినా ఆమె కిన్నెర వాయిద్యాన్ని విడిచిపెట్టలేదు. ఒంటరి మహిళ అయినా ఊరూరా తిరిగి కిన్నెర వాయిద్యం ద్వారా కుటుంబాన్ని పోషించేది.
ఒకప్పుడు గుర్రంపై కూచుని గ్రామాల్లో తిరుగుతూ కిన్నెర వాయిద్యాన్ని వాయించేది. కిన్నెర వాయిద్యాన్ని నైపుణ్యంగా వాయించడంలో ఆమె దిట్ట. పది వీరగాథలు అలవోకగా పాడుతూ ఆమె అందించే పన్నెండు కిన్నెర మెట్ల సంగీతాన్ని తెలంగాణలోని ప్రజలు బాగా ఆదరించారు.ఆమె తన 90వ యేట వికారాబాద్ జిల్లా తాండూరు మండలం
మంబాపూర్ గ్రామంలో డిసెంబరు 8, 2018న మరణించింది.

## కొత్త బిల్లుపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మహిళల బుజం మీద తుపాకీ పెట్టి బీసీల వెన్ను విరిచే బిల్లు పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్

శంకర్‌పల్లి: ఏప్రిల్ 20 (వుదయం)



ఇప్పటికే 2023లో పార్లమెంట్ లో పాస్ అయిన మహిళా బిల్లును అమలు చేయకుండా దాని ముసుగు వేసి దేశంలో అధిక శాతం ఉన్న బీసీ, బహుజనుల గొంతు వినిపించనీయకుండా, వారి వాటా దక్కకుండా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల హక్కులను అణచివేసే వీదంగా ఉన్న డెలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ఇండియా కూటమి ఓడించడం ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం అని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ తెలిపారు.
సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ప్రజాస్వామ్యం పై జరుగుతున్న జరుగుతున్న దాడిని తమ పార్టీ రాహుల్, ప్రియాంక గాంధీ నాయకత్వంలో సమర్థవంతంగా తిప్పి కొట్టింది. రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిందని వారు తెలిపారు. ఇప్పటికే ఆమోదం పొందిన మహిళా బిల్లు ఆధారంగా ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలలో 33 శాతం మహిళలకు కేటాయించే సౌలభ్యం ఉండగా, అందుకు చిత్తశుద్ధి లేని ఎన్డీఏ కూటమి పెరగాల్సిన సీట్లకు, మహిళా రిజర్వేషన్ కు ముడిపెట్టి కుట్రపూరితంగా బహుజనుల, దక్షనాది రాష్ట్రాల హక్కులను కాల రాసే విధంగా చేసే కుట్రకు మహిళా ముసుగు తొడిగి ప్రజాస్వామ్యాన్ని అణచివేసే కుట్రను తమ అధినాయకత్వం ప్రజాస్వామిక వాదులను కూడగట్టి సమర్థవంతంగా తిప్ప కొట్టడంలో విజయం సాధించిందని తెలిపారు. ఇప్పటికే ఉత్తరాది రాష్ట్రాలను దక్షిణాది రాష్ట్రాలు సాకుతున్న నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలను శాశ్వతంగా ఉత్తరాది రాష్ట్రాలకు ఆర్థికంగా, రాజకీయంగా బానిసలుగా మార్చే ఇలాంటి దొంగ బిల్లులు ప్రతి ఒక్కరు, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలు అర్థం చేసుకోవాలని
శ్రీజ్యోతి భీమ్ భరత్ కోరారు. ఇదే విషయాన్ని రానున్న రోజుల్లో ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో తిరిగి వివరిస్తామని తెలిపారు. అధిష్ఠానం, సీఎం ఇచ్చిన స్ఫూర్తితో ప్రజలందరికి బీజేపీ కుట్రలను, వారు తెచ్చే ఇటువంటి మోసపూరిత చట్టాలను ప్రజలకు w తెలియచేస్తామని వారు తెలిపారు.

## చేవెళ్లలో జాతీయ జనగణన 2026 -శిక్షణ తరగతులు




- మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో శిక్షణ చేవెళ్ల మండల స్థాయి సిబ్బందికి విడతల వారీగా అవగాహన సదస్సులు.

చేవెళ్ల ఏప్రిల్ 20 (వుదయం)

జాతీయ జనగణన-2026 కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం స్థానిక వివేకానంద జూనియర్ & డిగ్రీ కాలేజీలో ఏప్రిల్ 18, 20, 21 తేదీలలో జరుగుతోంది.ఈ సందర్భంగా మొదటి బ్యాచ్ శిక్షణ తరగతులను అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సందర్శించి సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.జనగణన దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియ అని పేర్కొంటూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలను డిజిటల్ పద్ధతిలో నమోదు చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ప్రక్రియపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శిక్షణలో భాగంగా మాస్టర్ ట్రైనర్లు సర్వే సమయంలో ఎదురయ్యే సవాళ్లు, గృహాల నంబరింగ్ విధానం వంటి ముఖ్యాంశాలపై సిబ్బందికి వివరించారు.ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటేశం పర్యవేక్షించారు. శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లు శివరాం, విజయ్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## గీతంలో ఎన్.సీ.సీ.పై అవగాహన

పటాన్చెరు (వుదయం)



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ ఆధ్వర్యంలో, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్.సీ.సీ) క్యాడెట్లకు సోమవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్.సీ.సీ.లోని పరిధి, శిక్షణ, అవకాశాల గురించి ఈ కార్యక్రమంలో పరిచయం చేశారు.ఈ సమావేశంలో, వార్షిక శిక్షణా శిబిరం (ఏటీసీ), గణతంత్ర దినోత్సవ శిబిరం (ఆర్డీసీ) తల్ సైనిక్ శిబిరం (టీఎస్సీ) ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్బీ) శిబిరంతో సహా వివిధ శిబిరాల ప్రాముఖ్యతను ఎన్.సీ.సీ. అధికారి, సీనియర్ క్యాడెట్లు వివరించారు. ప్రజెంటేషన్లు, వీడియోల ద్వారా, క్యాడెట్లకు మ్యాప్ రీడింగ్, దిక్సూచి వినియోగం, దూరాన్ని అంచనా వేయడం, క్షేత్ర సంకేతాలు, నిర్ధారిత సమయంలో టెంట్లు వేయడం, డ్రిల్, శారీరక శిక్షణ, ఆయుధ నిర్వహణ, సాంస్కృతిక మార్పిడి, జాతీయ స్థాయి పోటీలు వంటి కార్యకలాపాలను పరిచయం చేశారు. క్రమశిక్షణ, నాయకత్వం, జట్టు స్ఫూర్తి, జాతీయ భావనను పెంపొందించడంలో ఈ శిబిరాల పాత్రను ఈ సందర్భంగా ప్రముఖంగా తెలియజేశారు.ఎన్.సీ.సీ. శిక్షణ కేవలం సాధారణ డ్రిల్స్ కు మాత్రమే పరిమితం కాదని, బాధ్యతాయుతమైన, ఆత్మవిశ్వాసం గల పౌరులుగా తీర్చిదిద్దే పరివర్తనాత్మక అనుభవాలను అందిస్తుందని ఈ కార్యక్రమం ప్రస్ఫుటీకరించింది.అసోసియేట్ ఎన్.సీ.సీ. అధికారి లెఫ్టినెంట్ ఎస్.అజయ్ కుమార్ సీనియర్ క్యాడెట్ల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహణ

సిద్దిపేట/మిరుదొడ్డి, ఏప్రిల్ 20 (వుదయం )

మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో ఉన్న పీఎంఎస్‌హెచ్ఆర్ఐ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్/ఐసీ (బాలురు) పాఠశాలలో బాలల రక్షణ, సంరక్షణపై అవగాహన కార్యక్రమం మహిళా శిశు సంక్షేమ శాఖ,
.అలాగే స్కూల్ డ్రాప్‌అవుట్ విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించడం, బాలలపై దుర్వినియోగం నివారణ, బాల కార్మికులను విద్యలోకి తీసుకురావడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలలకు ఏ సమస్య వచ్చినా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని సూచించారు. ఈ సేవ 24 గంటలు అందుబాటులో ఉంటుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా బసవేశ్వర వ జయంతి

- మానవులంతా ఒకటేనని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- షాద్ నగర్ లో ఘనంగా బసవేశ్వర 893 వ జయంతి

షాద్ నగర్ , ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

వీరశైవసమాజం అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం మానవులంతా ఒకటేనని చాటి చెప్పిన గొప్ప వ్యక్తి బసవేశ్వరుడు అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్. హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ లు అన్నారు.
బసవేశ్వరుని బోధనలు స్ఫూర్తిదాయకమని కులవ్యవస్థ నిర్మూలనకు ఆయన చేసిన కృషిసమాజం మరువలేనిదని అన్నారు , బుధవారం షాద్ నగర్ పట్టణంలో పరిగి రోడ్లో గల మల్లికార్జున కాలనీలో మహాత్మా బసవేశ్వర 893 వ జయంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ సందర్భంగా మాట్లాడుతూ... లింగవివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని అన్నారు. లింగాయత ధర్మం స్థాపించి చిరుప్రాయంలోనే శివపురాణం గాధలను అవగతం చేసుకున్న మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వీరశైవసమాజం అధ్యక్షుడు బొబ్బిలి ప్రవీణ్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, కౌన్సిలర్లు కొప్పునూరి ప్రవీణ్,

అశోక్, పెంటయ్య, మార్గం రాజేష్, పట్వారి శ్రవణ్ కుమార్,సంతోష్, అగ్గనూర్ రవితేజ, సాయి కుమార్, విశ్వనాద్, లింగప్ప, మల్లిఖార్జునప్ప,కిషోర్, లింగప్ప,సాయి కుమార్, ప్రదీప్, మాధవలు, మహేష్, రమేష్, కొట్టే ఆనంద్ కుమార్, జమాల్పూర్ చందు, కుమార్, గంగమోని సత్తయ్య, శివ కుమార్, అనిల్ శరణప్ప రేణుకాంత్, శివ, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు..

## మహాత్మ బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకం



- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి - బీరంగూడలో ఘనంగా మహాత్మా బసవేశ్వరుడి 893వ జయంతి వేడుకలు

బీరంగూడ (వుదయం)

సమాజంలో అంటరానితనం, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా బసవేశ్వరుడని, ఆయన సూచించిన విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మహాత్మ బసవేశ్వరుడి 893వ జయంతిని పురస్కరించుకొని.. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని బీరంగూడ చౌరస్తాలో గల అశ్వారుడ బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలోనే కులం మతం వర్ణ వివక్షత లేని సమాజం కోసం అనుభవ మంటపాన్ని ఏర్పాటు చేసి, అన్ని మతాలు ఒక్కటేనని, మనుషులందరూ సమానమేనని చాటిచెప్పిన గొప్ప అభ్యుదయ వాది బసవేశ్వరుడని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఆయన స్ఫూర్తిని అందించాలన్న లక్ష్యంతో.. తెలంగాణా తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని ట్యాంకు బండ్ పైన బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, అదే స్ఫూర్తితో బీరంగూడలో 12 అడుగుల అశ్వారుడ బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కాయమే (శరీరం) కైలాసమని చాటి శ్రమ జీవులకు అత్యంత గౌరవం తీసుకువచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజి రెడ్డి గారు, గోదావరి అంజిరెడ్డి గారు, పుష్ప నగేష్ గారు,కాట శ్రీనివాస్ గౌడ్, నందారం నరసింహ గౌడ్ గారు, వీరశైవ లింగాయత్ సమాజం నియోజకవర్గం అధ్యక్షులు జగదీష్, బీరంగూడ సమాజ అధ్యక్షులు బసవరాజ్ , ప్రధాన కార్యదర్శి సంతోష్, బిహెచ్ఈఎల్ సమాజ అధ్యక్షులు విశ్వనాథ్ సమాజం ప్రతినిధులు, రామచంద్రపురం అధ్యక్షులు శివప్ప , పటాన్చెరు సమాజ అధ్యక్షులు సుధాకర్ గారు, శంకరప్ప గారు, అధిక సంఖ్యలో వీరశైవ లింగాయత్ సమాజ సభ్యులు పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కల సాకారం

అలంఖాన్ గూడ పంచాయతీలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం

శంకర్ పల్లి 20 (వుదయం)

ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ,"పేదలకు గృహం అనేది భద్రత, గౌరవం, భవిష్యత్తుకు బలమైన పునాది. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకుంటున్నాయి. ప్రతి అర్హుడికి ఇల్లు అందేలా కృషి చేయడం మా ప్రధాన లక్ష్యం.అనంతరం శంకర్ పల్లి పట్టణంలో నిర్వహించిన మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహాత్మా బసవేశ్వర గారు సమాజంలో సమానత్వం, న్యాయం, శ్రమకు గౌరవం అనే విలువలను బోధించారు. ఆయన ఆలోచనలు ఈరోజు కూడా ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఆయన చూపిన దారిలో నడుస్తూ సమాజ అభివృద్ధికి మనమందరం కలిసి కృషి చేయాలి. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం ప్రజలతో కలిసి ముందుకు సాగుతాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు కార్యకర్తలు, బసవేశ్వర భక్తులు పాల్గొన్నారు

IN THE COURT OF THE HON'BLE XIXth JUNIOR CIVIL JUDGE: CCC AT: HYDERABAD
O.S.No. 1060 OF 2026
Between:
Dharamaraju Deepika and others ...Plaintiff
AND
The Tahsildar (MRO),Saidabad Mandal,Hyderabad District and another ...Defendants
To
All Concerned
Whereas plaintiffs have instituted a suit against you for Declaration, praying the Hon'ble court to declare that the plaintiffs are the legal heirs of the deceased Pramod Dharmaraju, S/o Late Dharmaraju Radha Krishna against you, you are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some person able to answer all such question on this the 12th day of May, 2026 at 10-30 clock. Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence
(BY ORDER OF THE COURT)
Sd/-
D.L.N Goud,Advocate
11-18-50,Ground Floor,
Sri Laxminarsimha Swamy Nilayam,S V Colony Road No.5,Bhagatsingh Nagar, Saroor Nagar,
R R District-500 035
Cell No.9848080428




"అధికారాన్ని ఈ విధంగా బరితెగించి దుర్వినియోగం చేయడం ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలపై దాడి చేయడమే. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా సంచారం, వాక్ స్వాతంత్ర్యం, నిష్పక్షపాత రాజకీయ భాగస్వామ్యాలను తప్పనిసరిగా పరిరక్షించాలి. చట్టాన్ని పరిరక్షించాల్సిన సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించినప్పుడు, అది ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసి, మన ప్రజాస్వామ్య వ్యవస్థ సమగ్రతను క్షీణింపజేస్తుంది. రాజకీయ ప్రేరేపితమైన ఈ చర్యను నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రజాస్వామ్య వాణిని అణచివేసే ఇటువంటి ప్రయత్నాలకు వ్యతిరేకంగా దృఢంగా నిలబడతానని నా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాను. ప్రజలకు సేవ చేయాలని, న్యాయం, నిష్పక్షపాతం, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టాలనే మా కర్తవ్యం నుంచి ఎలాంటి బెదిరింపులూ మమ్మల్ని నిరోధించలేవు."

* – సెల్వ పెరుంతగై, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు

## వేమన పద్యం

ఓగునోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు బరమలుబ్ధు
పంది బురద మెచ్చు బన్నీరు మెచ్చునా?
విశ్వదాభిరామ వినురవేమ.



## సంపాదకీయం

# మణిపూర్ లో నిరవధిక అశాంతి

దేశ దేహంమీద ఎప్పటికీ మానని పుండులా కొనసాగుతున్నది. నిత్య కల్లోల పరిస్థితుల్లో ఎప్పుడు ఏ ఘోరం జరుగుతుందోనని అక్కడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. మైదాన ప్రాంత రాజధాని ఇంఫాల్ లో నివసిస్తున్న మెయితీలకు, కొండ ప్రాంత కుకీ తెగ కు మధ్య కొద్ది సంవత్సరాలుగా రగులుతున్న సమస్య ఎప్పుడు శాశ్వతంగా ఆగుతుందో తెలియడం లేదు.ఆ రాష్ట్రంలో, కేంద్రంలో కూడా బిజెపి యే అధికారంలో ఉన్న డబల్ ఇంజిన్ పాలన సైతం ఏమాత్రం తోడ్పడడం లేదు. ముఖ్యమంత్రిని మార్చినా ప్రయోజనం కలగలేదు. రాష్ట్రంలో అదే పనిగా హింస,జన జీవనం బంద్ సాగడంతో బిజెపి ని బహిష్కరించాలన్న నినాదం ఊపందుకుంటున్నది.బిజెపి లేదా దాని నాయకులు చేపట్టే కార్యక్రమాలను బహిష్కరించాలని మెయితీ పౌర సమాజ సంసల కూటమి కోకోమి పిలుపు ఇచ్చింది.మొన్న 7 వ తేదీన విష్ణుపూర్ జిల్లాలో జరిగిన బాంబు పేలుడులో ఇద్దరు చిన్నారులు దుర్మరణం పాలైన ఘటన రాష్ట్రాన్ని మరొక్కసారి భగ్గున మండించింది.ఈ ఘటన జరిగి రెండు వారాలు గడిచినా నిరసనలు ఆగలేదు. రాత్రిపూట వేలాదిమంది కాగడాలు పట్టుకొని నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు.అరెస్టులు జరుగుతున్నాయి.తాజా ఘర్షణల్లో ముగ్గురు మృతి చెందారు. వారిలో ఒక సైనికుడున్నాడు.ప్రస్తుత సంక్షోభాన్ని చల్లార్చడంలో ముఖ్యమంత్రి యుమ్నం ఖేంచంద్ సింగ్ విఫలమవుతున్న దృశ్యం కళ్ళకు కడుతున్నది. కేంద్రాన్ని రంగంలోకి దింపి తాడో పేడో తేల్చుకుందామని ఆందోళనకారులు ఆశిస్తున్నారు. ఇంతకు ముందు పార్లమెంటులో మణిపూర్ పై చర్చకు చాలాకాలం ముఖం చాటు చేసిన ప్రధాని ఎట్టకేలకు మణిపూర్ సందర్శనకు వెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.మెయితీలదే రాజకీయ అధికారం. కుకీలు ఎల్లప్పుడూ పాలితులే.మైనారిటీలే. వీరికి స్మగ్లర్లతో సంబంధాలున్నాయని ప్రచారంలో పెట్టారు. తాము నివసించే ప్రాంతాలను ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం కబ్జా చేస్తున్నాడని కుకీలు విమర్శిస్తూ వచ్చిన, వారి విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిన మాజీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ను చాలాకాలం తొలగించకుండా నిర్లక్ష్యం చేసి కేంద్రమే ఈ సమస్యను మరింత రాజేసింది. ఆ తర్వాత రాష్ట్రపతి పాలన మళ్ళీ మరో మెయితీ ముఖ్యమంత్రి ఇలా ఎన్ని చేసినా మణిపూర్ శాంతించడం లేదు. బిజెపి , కేంద్రం సమస్యను సమగ్ర దృష్టితో చూడడం లేదు.మెజారిటీ ఓటర్ల పట్ల పక్షపాతంతో వ్యవహరించడం వల్లనే చిక్కుముడి విడివడడం లేదు.తమకు కూడా ఎస్ టి గుర్తింపు ఇచ్చి గుర్తించి ప్రత్యేక సదుపాయాలు కల్పించాలన్న మెయితీల డిమాండ్ ను పరిశీలించాలని హై కోర్టు 2023 ఏప్రిల్ 14 న రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన సూచన మణిపూర్ సంక్షోభానికి దారి తీసింది. హింసాకాండ లో 250 మందికి పైగా మరణించారు. 60000 మంది నిర్వాసితులయ్యారు. 60 మంది సభ్యులున్న మణిపూర్ శాసనసభలో మెయితీలు 40 మంది కావడం గమనార్హం.మెయితీల పాలన పడగనీడ వంటిదని గట్టిగా నమ్ముతున్న కుకీలు తమకు స్వయంపాలనను కోరుతున్నారు.వారితో చిత్తశుద్ధి కూడిన చర్చలు జరగాలి. మెయితీలు హిందువులు.క్రైస్తవులైన కుకీలను కలుపుకొని పోవలసిన అవసరం ఎంతైనా వుంది.




## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# మహిళా ఓటు బ్యాంకు కోసం బిజెపి ఎత్తుగడ

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న, అమలుకు నోచుకుని చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్టం (నారీ శక్తి వందన్ అధినియమ్)ను మరోమారు అర్ధాంతరంగా పార్లమెంట్ ముందుకు తీసుకు రావడం ద్వారా నరేంద్ర మోదీ ప్రభుత్వం పరిపాలన పట్ల కన్నా ప్రజల్లో భావావేశాలు రెచ్చగొట్టడం ద్వారా పబ్బం గడుపుకునే మరో ప్రయత్నంకు తెరలేపింది. 2023లో ఈ బిల్లును దాదాపు అందరి మద్దతుతో ఆమోదించినప్పుడు తక్షణమే అమలు పరచాలని ప్రతిపక్షాలు అన్ని కోరినా పట్టించుకోలేదు. ఓ పదేళ్లు తర్వాత 2034 నాటికి గాని అమలు సాధ్యం కాదని చెబుతూ వచ్చింది. అయితే ఇప్పుడు అకస్మాత్తుగా ఓ ప్రక్కన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ఆమోదం పొందే ప్రయత్నం చేశారు. కనీసం పోలింగ్ పూర్తయ్యేవరకు ఆగమని, ముందుగా అఖిలపక్ష సమావేశం జరిపి ప్రభుత్వం తన ఉదేశ్యాలను వివరించామని ప్రతిపక్షాలు కోరినా పట్టించుకోలేదు. అసలు ఆ బిల్లుల ఉద్దేశ్యం ఏమిటో ఎన్డీయే కూటమి నేతలకే అంతుబట్టలేదు. పార్లమెంట్ సమావేశాల ముందు రోజు జనసేన, బిజెపి నేతలతో భేటీ జరిపిన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులకు ఫోనులు చేసి బిల్లుల వివరణలు అడగడం గమనార్హం. నియోజకవర్గాల పునర్విభజన గురించి ఆ బిల్లులో స్పష్టత లేదు. ప్రతి రాష్ట్రంలో 50 శాతం సీట్ల సంఖ్య పెంచుతామని అనడమే గాని ఆ అంశం బిల్లులో లేదు. ఈ విషయమై స్వయంగా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రుల వద్ద సందేహాలు వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత రాష్ట్రాల మధ్య సీట్ల దామాషా పంపిణీకి సంబంధించిన నిబంధన లేకపోవడాన్ని ప్రతిపక్ష సభ్యులు పదేపదే ఎత్తిచూపుతుండగా, స్పీకర్ ఓం బిర్లా బహుశా మొదటిసారిగా చర్చకు సమాధానం ఇస్తున్న హోంమంత్రి అమిత్ షాను మధ్యలో ఆపి ప్రతిపక్షం సహకరించడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, అటువంటి సవరణను చేర్చడానికి ఇప్పుడైనా ఎందుకు ప్రతిపాదించకూడదు? అంటూ నిలదీశారు. ఆ సూచనతో ఖంగుతిన్న అమిత్ షా వెంటనే ప్రతిపక్షం వైపు తిరిగి, అటువంటి చర్యకు వారి మద్దతు లభిస్తుందా? అని ప్రశ్నించారు. 50% పెంచుతూ సవరణ తీసుకొచ్చేందుకు సిద్ధమంటూనే గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తానని పార్లమెంట్ సాక్షిగా సెలవిచ్చారు. పక్కనే ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఉన్నారు. అంటే ఇటువంటి ఓ ప్రాధాన్యత గల బిల్లును



అవసరమైన కసరత్తు లేకుండానే బిల్లును తీసుకొచ్చారని స్పష్టం అవుతుంది. అందరికీ అమోదయోగ్యంగా ఉండే స్పష్టమైన బిల్లు తీసుకురాకపోవడంతోనే ఓటింగ్‌లో ఆ బిల్లు వీగిపోయిందని చెప్తున్నారు. మొత్తంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 12 ఏండ్లలో వీగిపోయిన తొలి బిల్లు ఇదేనని, ఇది మోదీ సర్కారుకు అతి పెద్ద దెబ్బ అని అభిప్రాయపడుతున్నారు. ఓటింగ్ కు ముందుగానే ఆ బిల్లుకు అవసరమైన మద్దతు లేదని స్పష్టం అయింది. అందుకనే ప్రధాని మోదీ నుండి అమిత్ షా వరకు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకపోతే మహిళలు మిమ్ములను క్షమించరు అంటూ హెచ్చరికలు జారీచేస్తూ వచ్చారు. అంటే, మహిళలకు చట్టసభలలో రేజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వంకు లేదని స్పష్టం అవుతుంది. బిజెపికి లేదా ఎన్డీయేకు గెలిచే అవకాశాలు కనిపించని పశ్చిమ బెంగాల్, తమిళ నాడులలో మహిళల సానుభూతి పొందటం ద్వారా ఏదోవిధంగా గెలుపొందాలని నిస్పృహతో చివరి ఆయుధంగా ఈ బిల్లులను తీసుకొచ్చారని అర్ధం అవుతుంది.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు వారం రోజుల ముందు నుండే దేశవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు ఈ బిల్లుకు మద్దతుగా ప్రకటనలు ఇవ్వడం, ప్రదర్శనలు చేపట్టడం చేస్తూ వస్తున్నారు. బిల్లును ఓటింగ్ కు పెట్టడానికి కొన్ని గంటల ముందే బీజేపీ ప్రతిపక్ష పార్టీలతో జరిపిన సంప్రదింపులు ఫలితం చూపకపోవడంతో, సంఖ్యాబలం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉందని స్పష్టమైంది. దానితో ఈ బిల్లును పార్లమెంటరీ కమిటీకి నివేదించడం ద్వారా ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నం చేయవచ్చని పలువురు బిజెపి సభ్యులు భావించారు. అయితే, ప్రభుత్వం ప్రచారంకోసం ఇచ్చిన ప్రాధాన్యత మహిళా సాధికారికత పట్ల చూపేందుకు సిద్ధపడలేదు. రెండు రోజులుగా మహిళా సాధికారికత గురించి వరుసగా ప్రకటనలు ఇస్తూ వచ్చిన ప్రధాని మోదీ ఈ బిల్లుకు మద్దతు కూడగట్టుకోవం కోసం ప్రధాన ప్రతిపక్ష నాయకులతో సంప్రదింపులు జరిపే ప్రయత్నం కూడా చేయలేదు. ఈ బిల్లును ఆమోదించడం ద్వారా తనకు ఖ్యాతి వస్తుందని భయపడవద్దని వ్యంగ్యంగా లోక్ సభలో చెప్పిన ఆయన ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల గురించి వారితో నేరుగా చర్చించే ప్రయత్నం చేయలేదు.

వాస్తవానికి నియోజకవర్గాల పునర్విభజనకు రాజ్యాంగ సవరణ అవసరం లేదు. పార్లమెంట్ లో సింపుల్ మెజారిటీతో ఆమోదం పొందవచ్చు. కానీ, మహిళా రిజర్వేషన్ కు సంబంధించిన రాజ్యాంగ సవరణతో ముడిపెట్టి వివాదాస్పదంగా మార్చారు. పైగా, ఎన్ని సీట్లు పెంచాలి, ఏ విధంగా పెంచాలి అనే విషయాన్నీ పునర్విభజన కమిషన్ చర్చించి, ప్రతిపాదనలు తయారు చేయాలి. కానీ ప్రభుత్వమే ముందుగా నిర్ణయించి అందుకోసం ఓ కమిషన్ వేస్తామని చెప్పడం చూసుంటే నిగూఢమైన అజెండాతో ప్రభుత్వం ఈ రాజ్యాంగ సవరణను తీసుకు వచ్చినట్లు వెల్లడి అవుతుంది. బిజెపికి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారింది. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే మహిళల ఓట్ల వల్లే బిజెపి వరుసగా విజయాలు సాధిస్తుంది అనడంలో అతిశయోక్తి లేదు. నేషనల్ ఎలక్షన్ స్టడీస్ (ఎన్ఇఎస్) సమాచారం ప్రకారం 1998 ఎన్నికల్లో బిజెపికి మహిళా ఓటింగ్ 33 శాతం. అప్పుడు అటల్ బీహారీ వాజ్‌పేయి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బిజెపికి మహిళా ఓటింగ్ తగ్గినా 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22 శాతం అయితే, బిజెపికి 36 శాతం మహిళా ఓటింగ్ నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి. 1952 నుంచి చూస్తే పార్లమెంటు మహిళా ప్రాతినిధ్యం శాతం 2024కి 15 శాతం కంటే తక్కువగా ఉంది. 1952లో 4 శాతంగా ఉంటే 2024కి 14 శాతానికి చేరింది. ప్రస్తుతం 15 శాతం కూడా లేని మహిళా ప్రాతినిధ్యాన్ని కేంద్రం అమాంతం రెట్టింపు చేయాలని చెబుతుంది. అయితే, పార్టీ సంస్థాగత కమిటీలలో మూడో వంతు స్థానాలను మహిళలకు ఇస్తున్నామని చెబుతున్న బిజెపి అధికార పదవులలో మాత్రం ఈ సూత్రం అమలు పరచడం లేదు. అఖిలేష్ యాదవ్ నిలదీసిన్నట్లు బిజెపికి 16 మంది ముఖ్యమంత్రులు ఉంటె, వారిలో ఒక్కరు కూడా మహిళా లేదు.

ఢిల్లీకి మహిళా ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ కేంద్రపాలిత ప్రాంతం కావడంతో ఆమెకు అధికారాలు నామమాత్రమే. బలమైన నేతలుగా పేరొందిన వసుంధరాజే సింధియా, ఉమాభారతి వంటి ముఖ్యమంత్రులను బలవంతంగా రాజకీయాలకు దూరం అయ్యేవిధంగా చేశారు. 46 ఏళ్ళ చరిత్ర గల బిజెపికి ఇప్పటి వరకు మహిళాలు ఎవ్వరూ అధ్యక్షులు లేకపోవడం గమనించాలి. మోదీ మొదటి మంత్రివర్గంలో విదేశాంగ మంత్రిగా సుష్మా స్వరాజ్ తన సమర్ధతతో అంతర్జాతీయంగా విశేష ప్రాచుర్యం పొందారు. అయితే ఆమెను ఎన్నడూ విదేశీ పర్యటనల్లో ప్రధాని తన వెంట తీసుకు వెళ్ళలేదు. అంతర్జాతీయ వ్యవహారాలలో ఆమె చురుకైన పాత్ర వహించకుండా అడ్డుకున్నారు. 2019 ఎన్నికలలో ఆమె తిరిగి ఎన్నికైనా ఆమెకు మాటమాత్రం కూడా చెప్పకుండా మంత్రివర్గంకు దూరంగా ఉంచారు. 46 సంవత్సరాల బిజెపి ప్రస్థానంలో ఇప్పటి వరకు ఆ పార్టీకి బహుళ నేత ఎవ్వరూ అధ్యక్షునిగా లేరు.

2014 నుండి ఐదేళ్లపాటు లోక్‌సభ స్పీకర్ గా వ్యవహరించిన సుమిత్రా మహాజన్ ఎంతో హుందాగా సభా కార్యక్రమాలు నడిపించారు. అన్ని పక్షాల ప్రశంసలు పొందారు. కానీ ఆమెను తిరిగి కనీసం లోక్ సభకు కూడా పోటీచేయనీయలేదు. ప్రతిపక్షాలు అభిశంస తీర్మానం ప్రతిపాదించిన ఓం బిర్లా వంటి వారిని వరుసగా రెండోసారి స్పీకర్ గా చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు చర్చకు వచ్చిన సందర్భంగా ఆమె పార్లమెంట్ కారిడార్లలో కనిపించగానే ఎందరో ఆమెను ఆత్మీయంగా పలకరించడం గమనిస్తే ఆమెకు ప్రజాజీవనంతో ఎంతటి గౌరవం ఉందో స్పష్టం అవుతుంది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సహా పలువురు సీనియర్ బీజేపీ నాయకులు ఆమె పాదాలకు నమస్కరించి ఆశీర్వాదం కోరారు. అటువంటి విశేష ప్రజాదరణ గల మహిళా నాయకులు అందరినీ తెరవెనుకకు పంపి, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ పేరుతో మహిళా ఓటర్లను ఆకట్టుకొనే ప్రయత్నం చేయడం విస్మయం కలిగిస్తోంది.

బిజెపి మహిళలు రాజకీయంగా ఉన్నత స్థానాలలోకి రావటాన్ని అంగీకరించలేక పోతున్నట్లు అగ్రనాయకులు ధోరణి వెల్లడి చేస్తుంది. సుష్మాపై స్వరాజ్, సుమిత్ర మహాజన్, వసుంధరరాజే సింధియా, ఉమా భారతి వంటి నాయకుల ఉనికిని భరింపలేక పోయారు. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ లాంటి క్రీడాకారులను బిజెపి నాయకుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేధిస్తున్నాడని రోజుల తరబడి రోదించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. న్యాయస్థానం జోక్యం చేసుకొంటే గాని వారిపై కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. భారత సైన్యంలో మహిళలకు గౌరవనీయ హోదా కల్పించడం కోసం కూడా సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం, నగంగా ఊరేగించటం వంటి తీవ్రమైన ఆరోపణలు వచ్చినా ప్రభుత్వం తగురీతిలో స్పందించలేదు. నిందితులపై తగు చర్యలు తీసుకోవడం పట్ల ప్రభుత్వం ఏమాత్రం ఆసక్తి చూపలేదు. కనీసం నిందితులను గుర్తించి అరెస్ట్ కూడా చేయలేకపోతున్నారు. మహిళా సాధికారికత అంటే చట్టసభలలో వారి ప్రాతినిధ్యం మాత్రమే కాదు. రాజకీయంగా మహిళలు ఎదగాలన్నది, పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్న విషయంపై ఎవరూ వ్యతిరేకించరు. అందరూ హర్షిస్తారు. రాజకీయాల్లో ధనబలం ఉండాలి. ఆ విషయంలో మహిళకు ఆర్థిక స్వేచ్ఛనిస్తారా? ఒకవేళ గెలిచినా మహిళల్ని తమ ఆలోచనలకు తగ్గట్టుగా పనిచేయనిస్తారా? విద్య, సామాజిక, ఆర్థిక పరంగా మహిళలు చైతన్యవంతంగా లేకుంటే ప్రభుత్వాలు ఆవిధమైన కృషి చేయకుంటే, ఈ రిజర్వేషన్లు పాలక పార్టీలకు ఊతకర్రలవుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సామాజిక, ఆర్థిక రంగాలలో వారికి సముచిత ప్రాధాన్యం లభించాలి. వివక్షత, వేధింపులకు అవకాశం లేనివిధంగా చట్టపరమైన రక్షణలు కల్పించడంతో పాటు వాటి అమలులో నిజాయితీ ప్రదర్శించాలి.



చలసాని నరేంద్ర
984956905
0

# అద్దెకు తెచ్చుకున్న అహానికి ఆయుష్షు ఎంత?

ఈ రోజు మన చుట్టూ ఉన్న సమాజాన్ని ఒకసారి నిశితంగా, ఏ కళ్ళజోడు లేకుండా నిజాయితీగా పరిశీలిస్తే ఒక విస్తుపోయే నిజం మన కళ్ళ ముందు నిలుస్తుంది. మనిషి వేసే ప్రతి అడుగు, పలికే ప్రతి మాట, చేసే ప్రతి పని వెనుక ఒక అదృశ్యమైన ప్రశ్న అంతర్లీనంగా మెదులుతూ ఉంటుంది.లోకం నన్ను ఎంత గొప్పగా చూస్తోంది?దురదృష్టవశాత్తూ, ఈ ఒక్క చిన్న ప్రశ్నే ఆధునిక సమాజంలో అనేక అనర్థాలకు, మానసిక వ్యాధులకు మూలకారణంగా మారింది. నేడు సేవ అంటే ప్రచారం, నైతికత అంటే ప్రదర్శన, మనిషిత్వం అంటే ఒక సోషల్ మీడియా పోస్ట్‌గా మారిపోయాయి. అసలైన విలువలు వెనక్కి నెట్టబడి, కేవలం బయటకు కనిపించే ప్రతిష్ట, అద్దెకు తెచ్చుకున్న కీర్తి, కొనుక్కున్న పురస్కారాల వెంట పడటం నేటి తరానికి ఒక సామాజిక అవసరంగా పరిణమించింది. మన పూర్వీకులు ఒక అద్భుతమైన మాట చెప్పేవారు అరటిపండు పండితేనే వంగుతుంది . అంటే, ఒక వ్యక్తిలో జ్ఞానం పెరిగే కొద్దీ, అనుభవం ముదిరే కొద్దీ ఆ వ్యక్తిలో వినయం, నిగర్వం సహజంగానే పెరుగుతాయని దాని అర్థం. కానీ, నేటి డిజిటల్ యుగంలో ఈ సూత్రం పూర్తిగా తలకిందులైంది. ఇక్కడ ఎంత తక్కువ విషయం ఉంటే అంత ఎక్కువ శబ్దం వినిపిస్తోంది. ఎంత లోతు తక్కువైతే అంత ఎక్కువ ఆర్భాటం కనిపిస్తోంది. ఎంతో మంది వ్యక్తులు తాము సాధించిన దానికంటే వెయ్యి రెట్లు ఎక్కువ చేసి చూపించుకోవడానికి నిరంతరం తపిస్తున్నారు. నకిలీ ప్రశంసలు, రంగురంగుల పురస్కారాలు, ఖరీదు కట్టి కొనుక్కున్న సర్టిఫికేట్‌లను గోడలకు తగిలించుకుంటే సమాజం గౌరవిస్తుందని భ్రమిస్తున్నారు. సోషల్ మీడియా వేదికలపై కొన్ని వేల రూపాయలు వెచ్చించి లైకులు,ఫాలోవర్లు కొనుక్కొని, తానేదో అద్భుతమైన ప్రజా నాయకుడినని, మేధావినని సెల్ఫ్ సర్టిఫికేట్ ఇచ్చుకుంటున్నారు.నిజమైన ప్రతిష్ట అనేది నీ చేతులతో, నీ కష్టంతో నిర్మించుకోవాల్సిన శిఖరం. ఎదుటివారి చప్పట్ల కోసం, కెమెరా క్లిక్కుల కోసం వేచి ఉండే ప్రతిష్ట వర్షం పడితే కరిగిపోయే మట్టి విగ్రహం లాంటిది. అసలు ఈ నకిలీ ప్రతిష్ట అంటే ఏమిటి? సులభంగా చెప్పాలంటే తమ అంతరంగంలో ఉన్న శూన్యాన్ని దాచిపెట్టి, బాహ్య ప్రపంచానికి ఒక మేకప్ వేసిన ముఖాన్ని చూపించే ప్రయత్నం. ఒక వ్యక్తి తన పేరు ముందు డాక్టర్ అని తగిలించుకుంటాడు, కానీ ఆ గౌరవ డాక్టరేట్ వెనుక ఎంతో కొంత విరాళం దాగి ఉంటుంది. మరొకరు మహాత్మా గాంధీ సేవారత్న వంటి పెద్ద పెద్ద పేర్లున్న పురస్కారాలు అందుకుంటారు, కానీ వారి సేవ కేవలం ఒక ఫోటో షూట్‌కు మాత్రమే పరిమితమై ఉంటుంది. ఈ ప్రహసనంలో భాగంగా ముందుగానే ప్రెస్ నోట్లు పంపడం, వేదికల మీద తనను తాను పొగిడించుకోవడం ఒక ఫ్యాషన్‌గా మారింది. ఈ వంటి బిరుదులు ఇప్పుడు సంతలో దొరికే వస్తువులయ్యాయి. కొంత సొమ్ము చెల్లిస్తే చాలు రంగుల స్టేజీ, మెరిసే షీల్డు, శాలువా కప్పే ఒక మాజీ ప్రముఖుడు అన్నీ సిద్ధమవుతాయి. పురస్కారం అందుకున్న మరుక్షణమే ఆ ఫోటోను ఇంటర్నెట్‌లో పోస్ట్ చేసి,నన్ను సమాజం గుర్తించింది అని గర్వంగా చెప్పుకుంటారు. కానీ ఆలోచించండి.డబ్బు ఇచ్చి కొనుక్కున్న గుర్తింపుకు విలువ ఉంటుందా? అద్దెకు తెచ్చుకున్న కిరీటం తల మీద ఎంతసేపు నిలుస్తుంది?మనస్తత్వ శాస్త్రవేత్తల విశ్లేషణ ప్రకారంఏ వ్యక్తి అయినా ఇలాంటి నకిలీ ప్రతిష్ఠల వెంట పరుగెత్తుతున్నాడంటే, అతని అంతరంగంలో తీవ్రమైన అభద్రతా భావం (Insecurity) రాజ్యమేలుతోందని అర్థం. గుర్తింపు కోసం ఉండే ఆకలి అతన్ని ఏ గడ్డినైనా కరిపిస్తుంది. నిజానికి ప్రతి మనిషికి తన పని ద్వారా, తన ప్రవర్తన ద్వారా గుర్తింపు పొందాలని ఉంటుంది. కానీ, ఆ స్థాయిని చేరుకోవడానికి కావాల్సిన సహనం, నిబద్ధత, నిరంతర కృషి నేటి కాలంలో కరువయ్యాయి. తక్కువ సమయంలో, షార్ట్ కట్ మార్గాల్లో 'స్టార్' అయిపోవాలనే ఆరాటం వారిని ఈ నకిలీ మార్గాల వైపు నడిపిస్తోంది.ఇది కేవలం వ్యక్తుల తప్పే కాదు, సమాజం కూడా ఇందులో భాగస్వామి అయింది. మనం విజయాన్ని కొలిచే కొలబద్దలు మారిపోయాయి. ఒక వ్యక్తి జ్ఞానాన్ని చూడటం మానేసి, అతను కట్టే బ్రాండెడ్ బట్టలు, అతను తిరిగే విలాసవంతమైన కార్లు, అతని పెళ్ళికి వచ్చిన జనం సంఖ్యను బట్టి అతని స్థాయిని నిర్ణయిస్తున్నాం. ఈ 'షో-ఆఫ్' సంస్కృతిలో బ్రతుకుతున్న సామాన్యుడు కూడా అప్పులు చేసైనా సరే బాహ్య ఆర్భాటాలతో తన జీవితాన్ని నింపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఫలితంగా మనశ్శాంతి మృగ్యమై, కేవలం ప్రదర్శన కోసం బ్రతికే యంత్రాలు తయారవుతున్నాయి.నకిలీ ప్రతిష్ట కోసం సాగుతున్న ఈ అంధకార పరుగు మొత్తం సమాజ వ్యవస్థను కుళ్ళిపోయేలా చేస్తోంది. దీనివల్ల కలిగే ప్రధాన నష్టాలను మనం గమనించాలి. నిశ్శబ్దంగా, నిస్వార్థంగా సేవ చేసే అసలైన మహానుభావులు వెలుగులోకి రాలేకపోతున్నారు. డబ్బు, పరపతి ఉన్న నకిలీ వ్యక్తులు పురస్కారాలను తన్నుకుపోతుంటే, నిజమైన ప్రతిభావంతులు నిరాశకు గురవుతున్నారు.

> **గుర్తింపు కోసం అడ్డదారులు తొక్కడం అలవాటైన వ్యక్తి అబద్ధాలు చెప్పడానికి, ఇతరుల క్రెడిట్‌ను దొంగిలించడానికి కూడా వెనుకాడడు. దీనివల్ల సమాజంలో విశ్వసనీయత దెబ్బతింటోంది. నేటి తరం పిల్లలు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లను చూసి, వారే తమ రోల్ మోడల్స్ అనుకుంటున్నారు. కష్టం లేకుండా వచ్చే పాపులారిటీయే జీవిత పరమావధి అని నమ్ముతున్నారు. మేధస్సు, కష్టం కంటే మేనేజ్మెంట్ గొప్పదనే భావన వారిలో బలపడుతోంది. రాజకీయాల్లోనూ, ప్రభుత్వ విభాగాల్లోనూ ఈ ప్రతిష్ట పిచ్చి పెరిగిపోయింది. పని కంటే పబ్లిసిటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో క్షేత్ర స్థాయిలో అభివృద్ధి కుంటుపడుతోంది**




కృత్రిమ ప్రయాణంలో మనిషి తన సహజత్వాన్ని కోల్పోయి, ఒక క్యారికేచర్‌గా మిగిలిపోతున్నాడు.నేటి కాలంలో పురస్కారాల ప్రదానం అనేది ఒక భారీ వాణిజ్య సామ్రాజ్యంగా (Business Industry) రూపాంతరం చెందింది. దశాబ్ది ఉత్తమ వ్యక్తి, నారీ శిరోమణి, యువ కిశోరం

గుర్తింపు కోసం అడ్డదారులు తొక్కడం అలవాటైన వ్యక్తి అబద్ధాలు చెప్పడానికి, ఇతరుల క్రెడిట్‌ను దొంగిలించడానికి కూడా వెనుకాడడు. దీనివల్ల సమాజంలో విశ్వసనీయత దెబ్బతింటోంది. నేటి తరం పిల్లలు సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లను చూసి, వారే తమ రోల్ మోడల్స్ అనుకుంటున్నారు. కష్టం లేకుండా వచ్చే పాపులారిటీయే జీవిత పరమావధి అని నమ్ముతున్నారు. మేధస్సు, కష్టం కంటే మేనేజ్మెంట్ గొప్పదనే భావన వారిలో బలపడుతోంది. రాజకీయాల్లోనూ, ప్రభుత్వ విభాగాల్లోనూ ఈ ప్రతిష్ట పిచ్చి పెరిగిపోయింది. పని కంటే పబ్లిసిటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుండటంతో క్షేత్రస్థాయిలో అభివృద్ధి కుంటుపడుతోంది.మరి నిజమైన ప్రతిష్ట అంటే ఏమిటి? మీరు ఒక గదిలో లేనప్పుడు, మీ ప్రమేయం లేకుండానే ఎవరైనా మీ పేరును తలుచుకుని, అతను/ఆమె చాలా మంచి వ్యక్తి, నిజాయితీపరులు అని మనస్ఫూర్తిగా అనుకుంటే అదే నిజమైన గౌరవం. ఇది సంతలో దొరకదు, ఫేస్‌బుక్ యాడ్స్‌తో రాదు. ఇది మీరు రోజూ చేసే చిన్న చిన్న సత్కార్యాల ద్వారా, మీరు నిలబెట్టుకునే మాట ద్వారా, మీరు ఇతరులకు చూపే ప్రేమ ద్వారా మెల్ల మెల్లగా నిర్మితమవుతుంది.మన తెలుగు సంస్కృతిలో ఒక గొప్ప మాట ఉంది.పుణ్యం పది కాలాల పాటు నిలుస్తుంది . అంటే మన శరీరం పోయినా మనం చేసిన మంచి పనులు లోకంలో నిలిచి ఉండాలి. చెట్టుకు పండ్లు కాసినప్పుడే దాని నీడకు విలువుంటుంది. అలాగే మన జీవితంలో సేవ అనే ఫలం ఉన్నప్పుడే మన పేరుకు సార్థకత ఉంటుంది. అంతేకానీ, వేదికల మీద దొరికే ఐదు నిమిషాల చప్పట్లు, ఫోటో ఆల్బమ్‌లో నిలిచిపోయే మెడల్స్ మనల్ని గొప్పవారిని చేయవు. వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ నిద్రపోయే ముందు ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. నేను ఇవాళ చేసిన పనులు నా ఆత్మతృప్తి కోసమా? లేక పక్కవాడి మెప్పు కోసమా? అని ప్రశ్నించుకోవాలి. మీరు ఒక పేదవాడికి సహాయం చేసినప్పుడు, ఆ క్షణాన్ని కెమెరాలో బంధించకపోయినా ఆ వ్యక్తి కళ్ళలో కనిపించే కృతజ్ఞత ఉంది చూశారా అదే అసలైన అవార్డు.సమాజంగా మనం కూడా మారాలి. అట్టహాసంగా జరిగే నకిలీ పురస్కార వేడుకలను బహిష్కరించాలి. డబ్బు ఇచ్చి అవార్డులు కొనే వారిని చూసి నవ్వుకోవాలే తప్ప, గౌరవించకూడదు. మీడియా సంస్థలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. పెయిడ్ న్యూస్‌లకు స్వస్తి చెప్పి, మారుమూల గ్రామాల్లో నిశ్శబ్దంగా విప్లవాలు సృష్టిస్తున్న అజ్ఞాత మహనీయులను లోకానికి పరిచయం చేయాలి. విద్యాసంస్థలు విద్యార్థులకు కేవలం ర్యాంకులనే కాకుండా, నైతికతను (Ethics) బోధించాలి. విలువ లేని గౌరవం, పునాది లేని భవనం లాంటిదని అర్థమయ్యేలా చెప్పాలి.సమాజంలో నకిలీ ప్రతిష్ట కోసం పరుగు తీయడం అనేది ఒక మత్తు పదార్థం లాంటిది. అది మొదట్లో అద్భుతమైన కిక్కునిస్తుంది, కానీ లోలోపల మనిషిని ఖాళీ చేసేస్తుంది. బంధుత్వాలను, స్నేహాలను, చివరకు సొంత వ్యక్తిత్వాన్ని కూడా బలి తీసుకుంటుంది. నిజమైన కీర్తి కోసం పరుగెత్తాల్సిన పని లేదు మీరు ఉన్న చోట మీరు నిజాయితీగా ఉంటే, మీ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తే, ఆర్తుల పట్ల కరుణ చూపిస్తే కీర్తి అదే మీ వెంట వస్తుంది.మన తెలుగు గడ్డ మీద పుట్టిన విశ్వనాథ సత్యనారాయణ గారు గానీ, బాపు గారు గానీ, అబ్దుల్ కలాం వంటి మహనీయులు గానీ ఎప్పుడూ పురస్కారాల కోసం పాకులాడలేదు. వారి నిబద్ధతే వారిని శిఖరాగ్రాన కూర్చోబెట్టింది. పురస్కారాలే వారి వెంట పడ్డాయి తప్ప, వారు పురస్కారాల వెంట వెళ్లలేదు. ఆ సంస్కారాన్ని పునికి పుచ్చుకోవడమే నేటి తరానికి ఉన్న ఏకైక మార్గం. ఆడంబరాల అద్దె కొంపలో కంటే, నిజాయితీ గల చిన్న గుడిసెలో ఉండే తృప్తి వెలకట్టలేనిది. మనమందరం ఆ దిశగా అడుగులు వేద్దాం.. మనల్ని మనం నకిలీ లోకం నుండి రక్షించుకుందాం.



డా.సూర్యదేవర రామకృష్ణ
9490754169



# జాతీయం-అంతర్జాతీయం



## ప్రపంచ ఉద్రిక్తతల నడుమ స్థిరత్వానికి మూలస్తంభాలు

# భారత్, -దక్షిణ కొరియా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (వుదయం):** పెరుగుతున్న ప్రపంచ ఉద్రిక్తతల నడుమ, స్థిరత్వానికి మూలస్తంభాలుగా భారతదేశం, దక్షిణ కొరియా పోషిస్తున్న కీలక పాత్రను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోమవారం నొక్కి చెప్పారు. శాంతియుత, సమ్మిళిత ఇండోపసిఫిక్ ప్రాంతం కోసం ఇరు దేశాలు కలిసికట్టుగా కట్టుబడి ఉన్నాయని కూడా ఆయన పేర్కొన్నారు.జాతీయ రాజధానిలో జరిగిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం చర్చల అనంతరం, ప్రధానమంత్రి మోడీ, అధ్యక్షుడు లీ జేమ్యుంగ్ పర్యవేక్షణలో భారతదేశం, దక్షిణ కొరియా మధ్య పలు అవగాహన ఒప్పందాలు కుదిరాయి.పలు వ్యూహాత్మక రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందాలు, హైదరాబాద్ హౌస్‌లో జరిగిన ఒక సంయుక్త ప్రకటన సందర్భంగా అధికారికంగా ఖరారయ్యాయి. ఇది ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలలో ఒక కీలక మైలురాయిని సూచిస్తుంది.ఒప్పందాల మార్పిడి అనంతరం సంయుక్త ప్రకటన చేస్తూ, ప్రస్తుత భౌగోళిక రాజకీయ వాతావరణంలో ఈ భాగస్వామ్యం ప్రాముఖ్యతను ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. ప్రపంచ ఉద్రిక్తతల కాలంలో, భారత్, కొరియా కలిసి శాంతి, స్థిరత్వ సందేశాన్ని ఇస్తున్నాయి, అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.భాగస్వామ్యంలోని ఆర్థిక కోణం విషయానికి వస్తే, ప్రధానమంత్రి ద్వైపాక్షిక వాణిజ్యానికి సంబంధించి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను పంచుకున్నారు. వ్యాపారాన్ని సులభతరం చేయడానికి అనేక కొత్త యంత్రాంగాలను ప్రవేశపెట్టారు.నేడు, భారతదేశం, కొరియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 27 బిలియన్ డాలర్లకు చేరుకుంది. 2030 నాటికి దీనిని 50 బిలియన్ డాలర్లకు పెంచడానికి మేం అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం, అని ఆయన పేర్కొన్నారు.ఈ లక్ష్యాలను సాధించడానికి, ఆర్థిక, పారిశ్రామిక సంబంధాలను క్రమబద్ధీకరించే లక్ష్యంతో కొత్త వేదికలను ప్రారంభిస్తున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. ఇరు దేశాల మధ్య ఆర్థిక ప్రవాహాలను సులభతరం చేయడానికి, మేం ఇండియాకొరియా ఫైనాన్షియల్ ఫోరమ్‌ను ప్రారంభించాం. వ్యాపార సహకారాన్ని బలోపేతం చేయడానికి, ఒక పారిశ్రామిక సహకార కమిటీని ఏర్పాటు చేశాం, అని ఆయన తెలిపారు. సాంకేతిక సరఫరా గొలుసులను సురక్షితం చేయడానికి, భారత మార్కెట్లోకి ప్రవేశించాలనుకుంటున్న చిన్న సంస్థలకు మద్దతు ఇవ్వడానికి సంబంధించిన ప్రణాళికలను కూడా ప్రధానమంత్రి వివరించారు.కీలక సాంకేతికత, సరఫరా గొలుసులలో సహకారాన్ని పెంచడానికి, మేం ఆర్థిక భద్రతా డైలాగ్ ను ప్రారంభిస్తున్నాం. కొరియా కంపెనీలు, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎస్ ఎంఇలు) భారతదేశంలోకి ప్రవేశించడాన్ని సులభతరం చేయడానికి, మేం కొరియన్ పారిశ్రామిక టౌన్‌షిప్‌లను కూడా ఏర్పాటు చేస్తాం. అలాగే, వచ్చే ఏడాదిలోగా భారత్‌కొరియా వాణిజ్య ఒప్పందాన్ని కూడా ఉన్నతీకరిస్తాం, అని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు ఈ భాగస్వామ్యపు దౌత్యపరమైన ప్రాముఖ్యతను నొక్కి చెబుతున్నాయి. ఫిబ్రవరి 2026 నుండి, అమెరికాఇజ్రాయెల్ దళాలు, ఇరాన్ మధ్య పరస్పర సైనిక చర్యల కారణంగా పశ్చిమ ఆసియాలో శత్రుత్వాలు తీవ్రతరం కావడం, అంతర్జాతీయ భద్రతను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రపంచ షిప్పింగ్ కారిడార్లలో విస్తృతమైన అస్థిరతకు కారణమైంది .ఈ అస్థిరత నేపథ్యంలో, భారతదేశం నేతృత్వంలోని కీలక అంతర్జాతీయ కూటములలో చేరాలన్న సియోల్ నిర్ణయాన్ని ప్రధానమంత్రి స్వాగతించారు. ఈ రోజు కొరియా అంతర్జాతీయ సౌర కూటమి, ఇండోపసిఫిక్ మహాసముద్రాల చొరవలో చేరడం మాకు చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.ప్రాంతీయ భద్రత కోసం రెండు ప్రజాస్వామ్య దేశాలు పంచుకుంటున్న ఉమ్మడి దృక్పథాన్ని నొక్కిచెబుతూ, , మన ఉమ్మడి ప్రయత్నాల ద్వారా శాంతియుత, ప్రగతిశీల, సమ్మిళిత ఇండోపసిఫిక్ దిశగా మేం మా వంతు కృషిని కొనసాగిస్తామని ప్రధానమంత్రి అన్నారు.ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రపంచ సంస్థలలో సంస్కరణలు అవసరమనే విషయంలో ఇరు దేశాలు ఏకీభవిస్తున్నాయని కూడా ఆయన సూచించారు.ఆధునిక భాగస్వామ్యానికి చారిత్రక సంబంధాలను వివరిస్తూ, భారత నోబెల్ బహుమతి గ్రహీత మాటలను ప్రధాని మోడీ గుర్తుచేసుకున్నారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం, భారతదేశపు కవి గురుదేవ్ రవీంద్రనాథ్ టాగోర్ కొరియాను తూర్పు దీపం అని పిలిచారు.

నేడు, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం అనే మన సంకల్పాన్ని సాకారం చేసుకోవడానికి కొరియా ఒక ముఖ్యమైన భాగస్వామి అని ఆయన అన్నారు..

ఈ ద్వైపాక్షిక సమన్వయం ఇరు దేశాలకే పరిమితం కాకుండా సుదూర ప్రభావాలను చూపుతుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. మన భాగస్వామ్యం ద్వారా, కేవలం ఇరు దేశాలకే కాకుండా యావత్ ప్రపంచానికి పురోగతి, శ్రేయస్సు కోసం మార్గం సుగమం చేద్దాం అని ప్రధాని మోడీ అన్నారు.

### భారత నౌకపై కాల్పులపై
## ఇరాన్ విచారణ

**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** హొర్ముజ్ జలసంధిలో భారత నౌకలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగాయనే వార్తలపై ఇరాన్ స్పందించింది.

ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు.

భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అనే అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

కాల్పులు జరిగినట్టు ధ్రువీకరణ కాలేదని, అయితే ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున వాటిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

హొర్ముజ్ జలసంధిలో శనివారం రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీ కాల్పులు జరిపినట్టు వార్తలు వచ్చాయి. ఐఆర్‌జీసీ అనుమతి లభించిన తర్వాతే ఆ రెండు నౌకలు హొర్ముజ్ లోకి ప్రవేశించాయి.

అయినప్పటికీ వాటిపై దాడి జరిగింది. ఈ ఘటనపై సీరియస్ అయిన కేంద్ర ప్రభుత్వం భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతే అలీకి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది.

'భారత నౌకలను మా దళాలే లక్ష్యంగా చేసుకున్నాయా అనే అంశంపై సంబంధిత సంస్థలు విచారణ చేపట్టాయి' అని ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు.

చర్చల విషయంలో అమెరికా సీరియస్‌గా లేదని అభిప్రాయపడ్డారు.

కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని అన్నారు.

## హొర్ముజ్ వద్ద భద్రతను ముమ్మరం చేసిన భారత్

### నౌకాదళ అనుమతి తప్పనిసరి' ఆదేశాలు జారీ



**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** ఏప్రిల్ 18న భారతకు చెందిన రెండు నౌకలపై కాల్పులు జరిగిన నేపథ్యంలో, హొర్ముజ్ జలసంధి సమీపంలో భారత్ సముద్ర భద్రతను కట్టుదిట్టం చేసింది. పర్షియన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న భారత జెండా కలిగిన నౌకలు ఈ కీలక మార్గంలో ప్రయాణించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలని భారత నావికాదళం తాజాగా ఒక సలహా జారీ చేసింది. ఆ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, కట్టుదిట్టమైన పర్యవేక్షణ నేపథ్యంలో, నావికాదళ అధికారుల అనుమతి లభించే వరకు లారాక్ ద్వీపానికి దూరంగా ఉండాలని నౌకలకు ప్రత్యేకంగా సూచించారు.

హెచ్చరికలకు దారితీసిన కాల్పుల ఘటనహొర్ముజ్ గుండా ప్రయాణానికి వేచి ఉన్న భారతీయ నౌకలకు సురక్షిత మార్గాన్ని కల్పించడానికి నావికాదళం ప్రాధాన్యత ఇస్తోందని అధికార వర్గాలు తెలిపాయి.

ఇప్పటివరకు 11 నౌకలు ఈ జలసంధిని దాటగా, చివరి ట్యాంకర్ 'దేశ్ గరిమ' ఏప్రిల్ 18న ప్రయాణించింది. అదే రోజు, 'జగ్ ఆర్నవ్ , 'సన్మార్ హెరాల్డ్ అనే రెండు నౌకలపై ఇరాన్ గార్డులు కాల్పులు జరిపి, వాటిని వెనక్కి తిరిగేలా చేశారని సమాచారం.

ఈ సంఘటన తర్వాత, నావికా దళాలు, వాణిజ్య నౌకల మధ్య సమన్వయం ముమ్మరమైంది.

ప్రపంచంలోని అత్యంత సున్నితమైన షిప్పింగ్ మార్గాలలో ఒకదానిలో పెరిగిన ప్రమాదాన్ని ప్రతిబింబిస్తూ, స్పష్టమైన అనుమతి పొందిన తర్వాత మాత్రమే నౌకలు కదలాలని ఆదేశాలు జారీ అయ్యాయి.లారక్ ద్వీపంపై దృష్టిహొర్ముజ్‌ను దాటిన తర్వాత, 'దేశ్ గరిమ' ఇప్పుడు అరేబియా సముద్రంలో భారత నౌకాదళం రక్షణలో ఉంది. ఇది ఏప్రిల్ 22న ముంబైకి చేరుకుంటుందని భావిస్తున్నారు.

జలసంధిలోని అత్యంత ఇరుకైన ప్రాంతాలలో ఒకదానిలో దాని వ్యూహాత్మక స్థానం, కీలకమైన ఇరాన్ చమురు మౌలిక సదుపాయాలకు సమీపంలో ఉండటం వల్ల లారాక్ ద్వీపం ఒక ప్రధాన కేంద్రంగా మిగిలిపోయింది. రాడార్ వ్యవస్థలు, రక్షణ ఏర్పాట్ల ద్వారా చుట్టుపక్కల జలాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం, 14 భారతీయ నౌకలు పర్షియన్ గల్ఫ్‌లో అనుమతి కోసం వేచి ఉన్నాయి.

పరిస్థితులు ప్రశాంతంగానే ఉన్నాయని నిర్ధారించిన వెంటనే, రక్షణతో కూడిన సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి భారత నావికాదళం ఆ ప్రాంతంలో ఏడు యుద్ధనౌకలను మోహరించింది.

## హొర్ముజ్ దిగ్బంధం ఎత్తివేతను
# ట్రంప్ ప్రకటించే అవకాశం?



**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** హొర్ముజ్ జలసంధిలో పరిస్థితిపై పాకిస్తాన్ సైన్యం చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌తో చర్చించిన తర్వాత దానిలో ప్రతిష్ఠంభనను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించే అవకాశమున్నట్టు సిఎన్ఎన్ న్యూస్ 18 ఛానెల్ పేర్కొంది. కీలకమైన ఇంధన రవాణా మార్గమైన ఈ జలసంధి దిగ్బంధనం చర్చలకు ఆటంకంగా నిలుస్తోందని, కీలక మధ్యవర్తి అయిన మునీర్ యుఎస్ అధ్యక్షుడికి చెప్పారు.

ఈ సలహాను పరిగణనలోకి తీసుకుంటామని ట్రంప్ చెప్పారని తెలుస్తోంది. హొర్ముజ్ దిగ్బంధనాన్ని ఎత్తివేసే ఏ ప్రకటన తర్వాత అయినా కాల్పుల విరమణ జరగవచ్చని, ఆ తర్వాత చర్చలను పునఃప్రారంభించే ప్రణాళికలను ఇరాన్ వివరించి, ఇస్లామాబాద్‌కు బృందాలను పంపవచ్చని ఇస్లామాబాద్‌లోని వర్గాలు ఆ ఛానెల్‌కు తెలిపాయి.

మునీర్, ఇరాన్ ప్రతినిధి బృందం గురించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు వివరించి, వారి చర్చల సందర్భంగా తెహ్రాన్ ఆందోళనలను తెలియజేశారు. అమెరికా నౌకాదళాలు ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని కొనసాగిస్తుండగా, హొర్ముజ్ జలసంధి గుండా వెళ్లే నౌకలపై ఇరాన్ ఆంక్షలను ఎత్తివేసి, ఆ తర్వాత మళ్లీ విధించింది. ఈ జలమార్గం ప్రపంచ చమురు, ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో సుమారు ఐదవ వంతును నిర్వహిస్తుంది.ఇలా ఉండగా, అమెరికా అసమంజసమైన వైఖరిగా అభివర్ణిస్తూ ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుత కాల్పుల విరమణ కొనసాగింపుపై సందేహాలను రేకెత్తించాయి. దౌత్యాన్ని కొనసాగించడంలో వాషింగ్టన్ సమంజసంగా లేదని తేలిందని, తెహ్రాన్ తను ప్రకటించిన డిమాండ్ల నుండి వెనక్కి తగ్గదని బఘాయి అన్నారు. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేటప్పుడు గడువులను గానీ, అల్టిమేటమ్‌లను గానీ అంగీకరించబోమని ఆయన తెలిపారు. రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగియక ముందే పాకిస్థాన్‌లో చర్చలు ప్రారంభించేందుకు అమెరికా సిద్ధమవుతుండగా, ఇస్లామాబాద్‌లో భద్రతా ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి.

అయితే, వాషింగ్టన్ అసమంజసమైన, అవాస్తవికమైన డిమాండ్లను ముందుకు తెస్తోందని ఇరాన్ పేర్కొంది. దీంతో చర్చల కాలపరిమితిపై కొత్తగా అనిశ్చితి నెలకొంది.

కాల్పుల విరమణ విఫలమయ్యే అవకాశం ఉందని, గల్ఫ్ ద్వారా నౌకాయానానికి అంతరాయం కొనసాగవచ్చనే ఆందోళనలు పెరగడంతో, చమురు ధరలు 6% పైగా పెరిగాయి, స్టాక్ మార్కెట్లు అస్థిరంగా మారాయి.

### అసెంబ్లీ ఎన్నికలు, ఉప ఎన్నికలకు
## డ్రై-డే అమలు- ఇసిఐ

**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** రాష్ట్ర అసెంబ్లీలకు జరుగుతున్న ఎన్నికల సందర్భంగా ఇసిఐ నిబంధనలను ప్రకటించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని 135సీ సెక్షన్ ప్రకారం ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే వరకు 48 గంటల పాటు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుంది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని హోటల్, భోజన శాలలు, మద్యం అమ్మే దుకాణాలు, మరే ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాల్లో అయినా.. మద్యం, పులియబెట్టిన లేదా మత్తు కలిగించే లిక్కర్ లేదా ఎలాంటి ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు లేదా పంపిణీ చేయకూడదు.

పైన పేర్కొన్న చట్టం ప్రకారం.. శాసనసభ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధలనకు అనుగుణంగా పోలింగ్ పూర్తయ్యే వరకు 48 గంటల పాటు డ్రై డేగా ప్రకటించాలి. ఒకవేళ ఏదైనా రీపోల్ చేయాల్సి వస్తే, ఆ తేదీకి కూడా ఇది వర్తిస్తుంది.

ఓట్ల లెక్కింపు జరిగే రోజైన 2026 మే 4 (సోమవారం)న కూడా ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధనల ప్రకారం డ్రై డేగా ప్రకటించాలని కమిషన్ ఆదేశించింది.

మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, క్లబ్బులతో సహా మద్యం అమ్మే లేదా అందించే ఏ ఇతర సంస్థలైనా పైన పేర్కొన్న తేదీల్లో మద్యాన్ని ఎవరికైనా అమ్మడానికి లేదా అందించడానికి అనుమతి లేదు.

నాన్‌ప్రొప్రయిటరీ క్లబ్బులు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, మద్యం నిల్వ చేయడానికి, సరఫరాలకు వివిధ విభాగాల పరిధిలో లైసెన్సులు కలిగి ఉన్న హోటళ్లకు ఈ రోజుల్లో అమ్మకాలు సాగించడానికి అనుమతి లేదు.

పైన పేర్కొన్న కాల వ్యవధిలో వ్యక్తులు మద్యం నిల్వ చేసుకోవడాన్ని అరికట్టాలి. లైసెన్సు లేని ప్రదేశాల్లో మద్యం నిల్వ చేయడంపై నియంత్రణలను పటిష్టంగా అమలు చేయాలి.

### మా వాగ్దానాలు
# నీటి మూటలు కావు



**చెన్నై, ఏప్రిల్ 20 (వుదయం):** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఎండలకన్నా, ఎక్కువగా ప్రచార హోరు రాజుకుంటోంది. ప్రధాన పార్టీలన్నీ కూడా తాడోపేడో అన్నస్థాయిలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. ఆనవాయితీగా వస్తున్న రెండు పార్టీల మధ్య పోటీ కాకుండా ఈసారి ముక్కోణపు పోటీ కావడంతో ఈసారి ఎన్నిక ఉత్కంఠతో సాగనుంది.తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు విజయ్ సక్దు పొన్నేరి అసెంబ్లీ నియోజకవర్గంలోని పంచట్టి ప్రాంతంలో భారీ రోడ్‌షో నిర్వహించారు.

ఈ అసెంబ్లీ ఎన్నికల ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేస్తున్న నటుడు విజయ్‌కు తమ మద్దతు తెలిపేందుకు ప్రజలు పోటెత్తారు.

అయితే, ఈ రోడ్‌షోకు హాజరైన టివికె మద్దతుదారులు ఎక్కువ సేపు ఎండలో ఉండటం వల్ల స్పృహ తప్పి పడిపోయారు.నటుడిగా ఉండి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్, తన పార్టీ టివికె తరపున ఎన్నికల బరిలో దిగడానికి సిద్ధమయ్యారు. ఇది ఎన్నికల పోరును త్రికోణ పోటీగా మార్చే అవకాశం ఉంది.

తిరుచిరాపల్లి తూర్పు నియోజకవర్గంలో, విజయ్ డిఎంకె అభ్యర్థి ఇనిగో ఎస్. ఇరుదయరాజ్‌పై పోటీ చేస్తున్నారు. అలాగే, ఆయన పెరంబూరు నియోజకవర్గం నుండి కూడా పోటీ చేస్తున్నారు, అక్కడ ఆయన డిఎంకె ఎమ్మెల్యే ఆర్. డి. శేఖర్‌ను ఎదుర్కొంటున్నారు.ఏప్రిల్ 23న జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే, మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సహాయం అందిస్తామని, అలాగే వార్షిక ఆదాయం రూ. 5 లక్షల కంటే తక్కువ ఉన్న కుటుంబాలకు చెందిన ప్రతి వధువుకు 8 గ్రాముల బంగారం, ఒక పట్టు చీర బహూకరిస్తామని హామీ ఇస్తూ, గురువారం నాడు విజయ్ తన పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు.నిజాయితీతో కూడిన పరిపాలననే టీవీకే తన సిద్ధాంతంగా స్వీకరించింది. అందుకే మా పార్టీ తొలి ఎన్నికల మేనిఫెస్టో కూడా నిజాయితీతో కూడిందని హామీ ఇస్తున్నాం. మేం స్టాలిన్ లాగా ప్రజలను తప్పుదోవ పట్టించం. ప్రజలకు ఉత్తుత్తి వాగ్దానాలతో నిండిన ఎలాంటి తొందరపాటు మేనిఫెస్టోను మేం తయారు చేయడం లేదు, అని విజయ్ అన్నారు.

అధికార, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతూ, డీఎంకే సహా ఇతరులందరూ ఒకటే అని చెప్పాం కదా? ఇరు పక్షాలు విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలను తీసుకుని పోల్చి చూడండి. ఒకటి రెండు అంశాలు ఒకేలా ఉన్నా ఫర్వాలేదు.

కానీ వాళ్ళు ఏం చేశారో మీకు తెలుసా? ఒకరు రూ.10,000 ఇస్తామని వాగ్దానం చేస్తే, మరొకరు రూ.8,000 కూపన్ ఇస్తున్నారు. ఒకరు రిఫ్రిజిరేటర్ ఇస్తే, మరొకరు రిఫ్రిజిరేటర్ కొనడానికి టోకెన్ ఇస్తున్నారు... ఈ విధంగా, ఇద్దరూ కేవలం పేరు, రంగు మార్చి ఒకే ఎన్నికల ప్రణాళికను సమర్పించారు.

వారంతా ఒకే గొడుగు కింద ఉన్న వారు మాత్రమే. కానీ వారిలా మేం ప్రజలను ఎన్నటికీ మోసం చేయమని ఆయన అన్నారు.యువత, సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకున్న కీలక ప్రతిపాదనలను ప్రకటిస్తూ, ప్రతి కళాశాల విద్యార్థికి మద్దతుగా, అండర్ గ్రాడ్యుయేట్ నుండి డాక్టరేట్ స్థాయి వరకు విద్యా రుణాల కోసం రూ. 20 లక్షల వరకు పూచీకత్తు లేని రుణ హామీని అందిస్తాం, ఏఐ (ఆధారిత ఉచిత పోటీ పరీక్షల కోచింగ్‌ను అందిస్తామని విజయ్ అన్నారు.తమిళనాడులో ఏప్రిల్ 23న ఒకే దశలో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపుకు ముహూర్తం ఖరారైంది.

ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, డిఎండికె, విసికె భాగస్వామ్యంతో డిఎంకె నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్; అలాగే బిజెపి, పిఎంకకె మిత్రపక్షాలుగా ఎఐఎడిఎంకె నేతృత్వంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్'కు మధ్య ప్రధాన పోటీ నెలకొంటుందని భావిస్తున్నారు.

## మణిపూర్‌లో కొనసాగుతున్న రాత్రి నిరసనలు

### ప్రేరేపకులపై పోలీసులు ఉక్కు చర్యలు ప్రారంభం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 20 (వుదయం):** మణిపూర్ లోయ ప్రాంతాలన్నింటా ప్రతి రాత్రి భారీ నిరసన ప్రదర్శనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నిరసనల సమయంలో చెలరేగే హింసకు పురిగొల్పే వారిపై రాష్ట్ర అధికారులు =కఠిన చర్యలు తీసుకోవడం ప్రారంభించారు.

బిష్ణుపూర్‌లోని ఒక ఇంటిపై జరిగిన క్షిపణి దాడిలో ఇద్దరు మెయితీ పిల్లలు మరణించిన రెండు వారాల తర్వాత కూడా, ఈ నిరసనలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్నాయి.

హింసాత్మకంగా మారిన నిరసనలుగత కొన్ని రోజులుగా ప్రతి రాత్రి వరుసగా ర్యాలీలు జరుగుతున్నాయి — వాటిలో కొన్ని చాలా భారీగా జరిగాయి.

రాత్రి కర్ఫ్యూను ధిక్కరిస్తూ పెద్ద సంఖ్యలో రులు భద్రతా దళాలతో ఘర్షణ పడ్డారు. ఆదివారం రాత్రి కాక్చింగ్, సగోల్‌బంద్, సెక్‌మై, హీన్‌గాంగ్, ఉరిపోక్ వంటి ప్రాంతాలలో ర్యాలీలు జరిగాయి.

కాక్చింగ్, ఉరిపోక్‌లలో, భద్రతా దళాలు టియర్ గ్యాస్ షెల్‌స్‌ను ప్రయోగించడంతో నిరసనలు హింసాత్మకంగా మారాయి. డీసీ కార్యాలయం వైపు నిరసనకారులు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో కాక్చింగ్ ర్యాలీలో హింస చెలరేగింది. ఉరిపోక్‌లో, ప్రదర్శనకారులు టైర్లకు నిప్పుపెట్టి రహదారిని దిగ్బంధించారు. వారు భద్రతా దళాలపై దాడి చేయడానికి సంబంధించి 21 మంది అరెస్టుఇంఫాల్ వెస్ట్‌లోని పట్సోయ్ నుండి సగోల్‌బంద్ వరకు శనివారం రాత్రి జరిగిన ర్యాలీ సందర్భంగా చోటుచేసుకున్న ఘర్షణకు సంబంధించి మణిపూర్ పోలీసులు 21 మందిని అరెస్టు చేశారు.

ఆ ర్యాలీ సందర్భంగా నిరసనకారులు పోలీసులపై రాళ్లు, పెట్రోల్ బాంబులు విసరడంతో పాటు వడిసెలలు, బండరాళ్లతో దాడి చేశారని పోలీసులు తెలిపారు.

ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది గాయపడినట్లు సమాచారం.

నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బలప్రయోగం చేయాల్సి వచ్చింది.పోలీసుల అప్పీలుఈ నిరసనల సమయంలో హింసకు ఉపయోగించే వస్తువులను ప్రేరేపకులు సరఫరా చేస్తున్నారని పోలీసులు హెచ్చరించారు. రాత్రిపూట జరిగే అనేక మీరా ర్యాలీల సందర్భంగా, నిరసనకారుల ముసుగులో చాలా మంది సంఘ విద్రోహ శక్తులు హింసాత్మక కార్యకలాపాలకు పాల్పడ్డారని పోలీసుల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు పెట్రోల్ బాంబులు, ఇనుప గుండ్లు అమర్చిన వడిసెలలు, రాళ్ల దాడికి పాల్పడ్డారని అందులో తెలిపారు.

చాలా మంది నిరసనకారులు మద్యం లేదా ఇతర మత్తు పదార్థాల ప్రభావంలో ఉన్నట్లు కూడా గమనించినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా, ఈ ర్యాలీలకు ముందు కొంతమంది ప్రేరేపకులు పెట్రోల్/కిరోసిన్ బాంబులు, వడిసెలలు, ఇనుప గుండ్లను సరఫరా చేస్తున్నట్లు తెలిసింది, అని పోలీసుల ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ రెచ్చగొట్టే చర్యలు జరిగినప్పటికీ, ఎటువంటి అనుకోని నష్టం జరగకుండా నివారించే లక్ష్యంతో, భద్రతా దళాలు గుంపులను చెదరగొట్టే సమయంలో గరిష్ట సంయమనం పాటించాయి అని ఆ విజ్ఞప్తిలో పేర్కొన్నారు.

శాంతి సామరస్యాలను కాపాడటానికి, హింసకు, ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి, ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండటానికి చట్ట అమలు సంస్థలకు సహకరించాలని పోలీసులు పౌరులందరికీ విజ్ఞప్తి చేశారు. హింసలో పాల్గొన్న వారిపై, రెచ్చగొట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసుల విజ్ఞప్తిలో తెలిపారు.

### ఉచితాల పిల్‌పై
## స్పందించిన సుప్రీం

**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించేందుకు ప్రకటించే ఉచిత హామీలపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) పై సుప్రీంకోర్టు స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ), కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)లకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. ఇప్పటికే ఇదే అంశంపై పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో దీనిని జత చేస్తున్నట్లు కోర్టు పేర్కొంది.

ఉచిత పథకాల వల్ల ప్రభుత్వ ఖజానాపై మోయలేని భారం పడుతుందని, ఇది రాష్ట్రాల అప్పులను పెంచి భవిష్యత్తు తరాలపై పెను భారం వేస్తుందని పిటిషనర్ వాదించారు. రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో ఇచ్చే హామీల వల్ల ప్రభుత్వానికి ఎంత ఖర్చవుతుంది? ఆ నిధులను ఎక్కడి నుంచి సేకరిస్తారు? అనే విషయాలను స్పష్టం చేస్తూ 'ఆర్థిక ప్రభావ ప్రకటన') సమర్పించాలని కోరారు

నిబంధనలు ఉల్లంఘించే లేదా ఆర్థికంగా సాధ్యం కాని హామీలు ఇచ్చే పార్టీలపై గుర్తింపు రద్దు వంటి కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఎన్నికల ప్రజాస్వామ్యంలో సంక్షేమ పథకాలకు, అనవసరమైన ఉచితాలకు మధ్య ఉన్న సన్నని గీతను ఈ విచారణ తేల్చనుంది. ప్రభుత్వాల ఆర్థిక క్రమశిక్షణను కాపాడటమే లక్ష్యంగా ఈ పిటిషన్ దాఖలైంది. కోర్టు విచారణ అనంతరం కేంద్రం , ఎన్నికల సంఘం ఇచ్చే వివరణలు భారత ఎన్నికల వ్యవస్థలో కీలక మార్పులకు దారితీసే అవకాశం ఉంది.

### చెట్టును ఢీకొట్టి..
## కుప్పకూలిన ప్రైవేటు జెట్

**వుదయం డెస్క్, ఏప్రిల్ 20:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం జశ్‌పూర్ జిల్లాలోని కొండల్లో ప్రైవేట్ జెట్ కుప్పకూలింది. అటవీ ప్రాంతంలో చెట్టును ఢీకొన్న తర్వాత ఇది కూలిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు చనిపోయినట్లు తెలుస్తోంది. ఘటనాస్థలిలో మంటలు ఎగసిపడటంతో పాటు పొగ దట్టంగా అలముకుంది. ప్రైవేటు జెట్‌లో ఎంత మంది ప్రయాణించారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.



# ఎరువుల సరఫరాలో ఆలస్యం ఉండదు





## ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి ప్రభుత్వం సహకారం రామగుండంలో యూరియా ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష – ఫీల్డ్ స్థాయిలో పరిశీలన

**పెద్దపల్లి రామగుండం, (వుదయం ప్రతినిధి)**
రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్ సూచించారు.సోమవారం రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ (RFCL) ప్లాంట్‌లో తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి శ్రీ సురేంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తో కలిసి యూరియా ఉత్పత్తి, సరఫరాపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ మరియు సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, తెలంగాణకు యూరియా ప్రధాన సరఫరాదారుగా ఉన్న ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ నుండి ఖరీఫ్ సీజన్‌లో ఎలాంటి ఆలస్యం లేకుండా ఎరువులు అందుబాటులో ఉండేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రైతులకు సమయానికి ఎరువులు అందడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, నిల్వలు, సరఫరాలో సమన్వయం పాటించాలని సూచించారు. రైతుల ప్రయోజనాల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఎరువుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ తో కలిసి ప్లాంట్‌ను సందర్శించి, యూరియా ఉత్పత్తి ప్రక్రియను ఫీల్డ్ స్థాయిలో పరిశీలించారు. ఉత్పత్తి సామర్థ్యం, యంత్రాల పనితీరు, నిల్వలు వంటి అంశాలను పరిశీలించి అధికారులతో చర్చించారు.ఈ సమీక్ష సమావేశంలో ప్లాంట్ యూనిట్ హెడ్ జిందాల్, ప్రొడక్షన్ హెడ్ సహా, టెక్నికల్ సర్వీసెస్ హెడ్ డి. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన.. భోజనం అందించాలి

**జగిత్యాల (వుదయం ప్రతినిధి)**
ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ వారం వెల్ఫేర్ వీక్ మొదటి రోజులో భాగంగా గొల్లపల్లి మండలంలోని మహాత్మ జ్యోతి పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా మహాత్మ జ్యోతి బాపూలే పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి భోజన నాణ్యత పరిశుభ్రత వంటశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత రుచిపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు భోజనం సక్రమంగా సమయానికి అందుతున్నదా అనే అంశాన్ని కూడా పరిశీలించారు డైట్ మెను వంటగది పరిశుభ్రత నీటి వినియోగం నిల్వ కిచెన్ షెడ్ విధానాలపై ప్రత్యేకంగా పరిశీలించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వారికి అందించే భోజనం నాణ్యంగా పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని తెలిపారు వంటశాలల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు సంక్షేమ పాఠశాలల్లో మెనూ సమర్థవంతంగా అమలు కావాలని అన్నారు విద్యార్థులకు సురక్షితమైన శుభ్రమైన



వాతావరణంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ తో పాటు సంక్షేమ అధికారి కె రాజ్ కుమార్ జిల్లా విద్యాధికారి కె రాము బిసి సంక్షేమాధికారి సునీత తహసీల్దార్ ఎంపిడివో మండల విద్యాధికారి పాఠశాల ఉపాధ్యాయులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# భూమి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**ఆసిఫాబాద్, వుదయం ప్రతినిధి**
పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెం పొం దిం చేం దు కు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ మదర్ ఎర్త్ ఫోర్ట్‌నైట్ పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టర్ కె. హరిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూమి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ముఖ్యంగా నేల సంరక్షణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, సేంద్రియ ఎరువుల వినియోగం వంటి చర్యలు పర్యావరణానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.పోస్టర్‌లో నేల పరిరక్షణకు సంబంధించిన ముఖ్య సందేశాలు, పంట కవర్లు పెంచడం, సేంద్రియ ఎరువుల వినియోగం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలను ప్రతిబింబించారని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, యువతలో పర్యావరణంపై చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు. జాతీయ హరిత దళం రీజనల్




ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర, జిల్లా కోఆర్డినేటర్ కటకం మధూకర్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన ప్రక్రియ శిక్షణ తరగతులు ప్రారంభం

**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)**
జనగణన ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా చేపట్టాలని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆద్వర్యంలో సోమవారం ఓ ప్రైవేటు కళాశాలలో జనగణన శిక్షణ తరగతులు ప్రారంభం అయ్యాయి. ఈ శిక్షణ తరగతులు 30 వ తేదీ వరకు మాస్టర్స్ ట్రైనర్లతో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు బ్యాచ్ ల వారిగా చేపట్టబోయే జనగణన పై శిక్షణ తరగతులు జరగనున్నాయి. నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ ట్రైనింగ్ సెంటర్ ను సందర్శించి మొదటి రోజు శిక్షణ తరగతులను తనిఖీ చేసి పరిశీలించారు. జనగణన ప్రక్రియ ఫీల్డ్ లెవల్ విధుల నిర్వహణ, నియమ నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై శిక్షణ తరగతుల్లో దిశానిర్దేశం చేయాలని ట్రైనర్లను ఆదేశించారు. అనంతరం ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లకు పలు సూచనలు చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిదిలో త్వరలో చేపట్ట బోయే జన గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. హౌస్ లిస్టు బ్లాక్ ల ప్రకారం ఎన్యూమరేటర్లు సూపర్ వైజర్లు ప్రతి ఇంటిని సందర్శించి డాటా సేకరించాలన్నారు. ఎక్కడా




జాప్యం జరగకుండా చూడాలని ఖచ్చితమైన సమాచారం సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనగణన ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి వారు స్వచ్చందంగా సమాచారం తెలిపేలా ప్రోత్సహించాలని సూచించారు. సూపర్ వైజర్లు జనగణన చేపట్టాలన్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు వేణు, శ్రీధర్, జనగణన ట్రైనర్లు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో బాధితుడు కలెక్టర్ కు ఫిర్యాదు




**కోరుట్ల (వుదయం ప్రతినిధి)**
తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కొరుట్ల పట్టణానికి చెందిన సయ్యద్ ఇల్హాజ్ ఉద్దీన్ అనే బాధితుడు బి శ్రీనివాస్ పై ఫిర్యాదు చేసినట్లు సయ్యద్ ఇల్హాజ్ ఉద్దీన్ తెలిపారు బి శ్రీనివాస్ అనే బంగారు ఆభరణాల వ్యాపారి వడ్డీకి డబ్బులు ఇచ్చే వ్యక్తి ఆర్థిక మోసం చేసి తన బంగారు ఆభరణాలను తిరిగి ఇవ్వకుండా నిరాకరిస్తున్నారని తెలిపారు ఆర్థిక ఇబ్బందుల కారణంగా 65 గ్రాముల బంగారు ఆభరణాలను పూచీకత్తుగా ఇచ్చి డబ్బు తీసుకున్నానని అయితే తరువాత దుకాణదారు ఒప్పందానికి విరుద్ధంగా అదనపు డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా ఆభరణాలను అమ్మేశానని చెపుతున్నాడని సయ్యద్ ఇల్హాజ్ ఉద్దీన్ తెలిపారు ఈ విషయంపై తాను కోరుట్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని దీంతో ప్రజావాణిలో ఉన్నతాధికారులను ఆశ్రయించానని తెలిపారు ప్రజావాణి కార్యక్రమంలో అధికారులు ఫిర్యాదును స్వీకరించి ఈ విషయంపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు తాను ఈ ఆభరణాలను తన కుమార్తె వివాహం కోసం ఎన్నో ఏళ్లుగా కష్టంపడి సేకరించానని ప్రస్తుతం తీవ్ర మానసిక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు తనకు న్యాయం చేసి తన ఆభరణాలను తిరిగి పొందేలా సహాయం చేయాలని అధికారులను కోరారు

# నృసింహ నవరాత్రోత్సవాలు


## ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ ఈఓ సంకటాల.శ్రీనివాస్





**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి నవరా త్రోత్సవాలకు రంగం సిద్ధమైంది.ఈ నెల 22వ తేదీ బుధవారం నుంచి 30వ తేదీ గురువారం వరకు నవరాత్రో త్సవాల ను అత్యంత వైభవంగా నిర్వహించను న్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సంకటా ల.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపా రు.తొమ్మిది రోజుల పాటు క్షేత్రం లో ఆధ్యాత్మిక శోభ సంతరించు కోనుం ది.ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 25 శనివారం అన్నకూ టోత్సవం, ఏప్రిల్ 26 ఆదివారం సహస్ర కలశాభిషేకం, ఏప్రిల్ 27 సోమవారం చందనోత్సవం,
ఏప్రిల్ 28 మంగళవారం పల్లవో త్సవం,వసంతోత్సవం, ఏప్రిల్ 29 బుధవారం లక్ష తులసి అర్చన, ఏప్రిల్ 30 గురువారం నృసింహ జయంతి నిర్వహించబడును. ఉత్సవాలకు నేరుగా హాజరు కాలేని భక్తుల కోసం ప్రత్యేక సౌకర్యం కల్పిం చారు. భక్తులు తమ గోత్రనామాలతో ఆన్‌లైన్ ద్వారా పూజలు జరిపించు కోవ చ్చు.దీనికోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెం: 135410011000001, IFSC: UBIN0813541కు నిర్ణీత రుసుము చెల్లించి, వివరాలను 08724273227 లేదా 08724 357333 నంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. నవరాత్రుల్లో విశేష పూజలు,అభిషే కం,కళ్యాణం ₹2,516/ నవరాత్రుల్లో విశేష పూజలు, అభిషేకం ₹1,516/, నవరాత్రుల్లో విశేష పూజలు ₹1,116/నృసింహ జయంతి రోజున అభిషేకం, స్తంభోద్భవ పూజ ₹516/ స్వామివారి కృపకు పాత్రులు కావాలని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఈఓ విజ్ఞప్తి చేశారు.

# గిరిజన ఆశ్రమ వర్కర్లకు.. పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**ఆసిఫాబాద్ ( వుదయం ప్రతినిధి )**
తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్స్ డైలీవేజ్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి కీ గిరిజన హాస్టల్స్ వర్కర్ల. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేయడం జరిగింది.
ఈ సందర్భంగా సిఐటియు జిల్లా జాయింట్ సెక్రటరీ వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ డైలీవేజ్ మరియు ఔట్సోర్సింగ్ వర్కర్ల కు గత 8 నెలలుగా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయని వేసవి సెలవులు దగ్గర కావస్తున్నప్పటికీ ఇంతవరకు గత ఏడాది సమ్మర్ క్యాంపు వేతనాలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు గత చేసిన సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలని సమ్మె సందర్భంగా గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చేలాచూడాలనీ లేని పక్షంలో యూనియన్ గా చేపట్టే ఆందోళన కార్యక్రమాలకు ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. హాస్టల్స్ డైలీవేజీ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్, జిల్లా కార్యదర్శి అడ శ్యామ్ రావు ,జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల కోటయ్య ,జిల్లా నాయకులు కుమ్రం సత్యవతి, కోవ సురేందర్, నైతం మధుకర్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ బసవేశ్వర జయంతి వేడుకలు

**కామారెడ్డి, (వుదయం ప్రతినిధి):**
బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహాత్మ బసవేశ్వర జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, మహాత్మ బసవేశ్వరుడు (1134-1196) 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్వవేత్త, సంఘ సంస్కర్త, కవి, లింగాయత్ ధర్మ స్థాపకుడు అని పేర్కొన్నారు. కులవ్యవస్థ, లింగ వివక్షత, మూఢనమ్మకాలపై పోరాడి, 'అనుభవ మంటపం' ద్వారా సమానత్వం, సత్యం, శ్రమ గౌరవాన్ని ప్రచారం చేసిన మహనీయుడు అని వివరించారు. కష్టపడి పని చేయడమే కైలాసం అనే సందేశంతో శారీరక శ్రమకు, నిజాయితీకి ప్రాధాన్యత



ఇచ్చిన ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. అలాగే బహుజన సంఘాల నాయకులు కూడా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ , బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, బి.సి. నాయకులు నీల నాగరాజు, లింగాయత్ సమాజ ప్రతినిధులు కపిల, ప్రభాకర్, అశ్వక్, నరేష్, శాంతయ్య, స్వప్న, పవన్, జిల్లా అధికారులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

# సైడ్ డ్రైన్ పనులు పూర్తి చేయిస్తాం

## -మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి




**మంచిర్యాల /రామకృష్ణాపూర్ ఏప్రిల్ 20(వుదయం ప్రతినిధి)**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రామకృష్ణాపూర్ పట్టణంలో గల 17 వ వార్డ్ విద్యానగర్ ప్రాంతంలో గల పట్టణంలోని మెయిన్ స్ట్రీమ్ డ్రైన్ ను మునిసిపాలిటీ చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి రాజా రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సంధ్యారాణి మాట్లాడుతూ.. గత వర్షాకాలంలో ఈ ఏరియాలో సైడ్ డ్రెయిన్ ఉండడంతో ఇండ్లలోకి మురుగునీరు చేరి ఇబ్బందులకు గురైందని ప్రాంత ప్రజలు తెలపడంతో మునిసిపాలిటీ ఆశ్రిత్ తో కలిసి డ్రైన్ పరిశీలించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం రాకముందే డ్రైన్ పనులను త్వరితగతిన చేయించాలని సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు. మునిసిపాలిటీలోని ప్రతి ఏరియాలో గల సైడ్ డ్రైన్ లను పరిశీలిస్తామని తెలిపారు. టిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రామిడీ ఉమాదేవి కుమార్, మొగిలి లక్ష్మీ సునీత, యూత్ నాయకులు రామిడి లక్ష్మీకాంత్, మనీ పాల్గొన్నారు

# ఇంద్రవెల్లి అమరులకు నివాళి

## – ఆదివాసీల భావోద్వేగ స్మరణ

**అదిలాబాద్, వుదయం ప్రతినిధి:**
ఇంద్రవెల్లి అమరవీరుల స్మృతివనంలో 45 ఏళ్ల తర్వాత స్వేచ్ఛగా నిర్వహించిన స్మారక కార్యక్రమం ఆదివాసీలలో భావోద్వేగాలను రేకెత్తించింది. పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరై అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమానికి ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎంపీ సాయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆత్రం సుగుణతో కలిసి అమరవీరుల స్తూపానికి పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరించారు. అనంతరం స్తూపానికి పూలమాలలు వేసి అమరులకు ఘన నివాళులర్పించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్కరణ దినోత్సవం సందర్భంగా అమరుల కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయం అందిస్తామని తెలిపారు. గిరిజనులకు భూహక్కులు ఆర్వోఎఫ్ఆర్ ద్వారా కల్పించామని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, స్మృతి వన అభివృద్ధి కోసం కాంపౌండ్ వాల్, సోలార్ కరెంట్, బోర్‌వెల్ వంటి సదుపాయాలు



కల్పించామని చెప్పారు. స్మృతి వనాన్ని రూ.15 లక్షలతో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.
ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు ఇళ్ల సమస్య, త్రీఫేజ్ విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ఐటీడీఏ పీవో, అటవీ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్రం భుజేంద్రరావు రచించిన "ఆ గాయానికి 44 ఏళ్లు" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, గిరిజనులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీస్ మహాసభల ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా ఆడపిల్లల విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ, స్మృతివన అభివృద్ధి పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. గిరిజన గ్రామాల్లో నీటి సమస్యలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బోర్‌వెల్‌లు లేదా బావులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు చదువు మానేయకుండా తల్లిదండ్రులు చైతన్యం కలిగి ఉండాలని, గ్రామ పటేళ్లు, సార్మేడి నాయకులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు, సార్మేడీలు, పటేళ్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలి



**నిజామాబాద్, వుదయం ప్రతినిధి :**
పట్టణ ప్రాంతాలలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సోమవారం హైదరాబాదు నుంచి ముఖ్య ఎన్నికల అధికారి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా జరిగిందని, తెలంగాణలోనూ వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఈఆర్ఓలు, ఏఈఆర్వోలు మ్యాపింగ్ ప్రక్రియ విషయంలో సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు, సూపర్వైజర్లకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలన్నారు. బూత్ స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకానికి సంబంధించి ఇప్పటికే పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున వారి సహకారం తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓ లతో స్వయంగా మ్యాపింగ్ చేయించుకునేందుకు ఆసక్తి చూపితే మిగిలిన వారి మ్యాపింగ్ చేసేందుకు సులభతరమవుతుందని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ పురోగతిలో ఉందని అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలో వివిధ కారణాల వల్ల కొంత వెనుకబడి ఉందన్నారు. అర్బన్ లో 44.78 శాతం మ్యాపింగ్ జరిగిందని, ఈ ప్రక్రియపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి వారం పది రోజుల వ్యవధిలో 70 శాతం వరకు మ్యాపింగ్ పూర్తి చేయిస్తామని తెలిపారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపడతామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీవో రాజేంద్ర కుమార్, విజయేందర్ పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## అనాథలైన చిన్నారులకు అభయహస్తం

- మానవత్వాన్ని చాటుకున్న యువనేత చిలుకూరి మహేందర్ రెడ్డి

సిద్ధిపేట/జగదేవపూర్, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి)



"మానవ సేవయే మాధవ సేవ" అనే నినాదాన్ని నిజం చేస్తూ, కష్టాల్లో ఉన్న వారికి నేనున్నానంటూ భరోసా కల్పిస్తున్నారు సిద్ధిపేట జిల్లా యువ నాయకులు చిలుకూరి మహేందర్ రెడ్డి. ఆపదలో ఉన్న వారికి అపద్బాంధవుడిగా నిలుస్తూ తన దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే..సిద్ధిపేట జిల్లా జగదేవపూర్ మండలం దౌలాపూర్ గ్రామానికి చెందిన కొండాపూర్ ఉమారాణి గత వారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మరణంతో ముగ్గురు చిన్నారులు తల్లిని కోల్పోయి అనాథలయ్యారు. తండ్రి ఉన్నప్పటికీ, ఆయనకు చెవులు వినిపించని (బధిరత్వం) పరిస్థితి ఉండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది.

**తక్షణ స్పందన - ఆర్థిక సాయం:**

ఈ విషాద వార్త తెలుసుకున్న మహేందర్ రెడ్డి వెంటనే స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి వారి దైన్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. సోమవారం ఆ కుటుంబానికి నిత్యవసర సరుకులను అందజేశారు. మనోధైర్యాన్ని కల్పించారు. పేద కుటుంబాలకు కొండంత భరోసాను అందించడమే మన అందరి ప్రాథమిక బాధ్యత. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలోనే అసలైన తృప్తి ఉంది అని పిలుపునిచ్చారు.

## సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయం నందు

# గ్రీవెన్స్ డే నిర్వహణ

- బాధితుల సమస్యల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి
- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



బాధితుల సమస్యల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అధికారులను ఆదేశించారు.
సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయం నందు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీకి, జిల్లా నలుమూలల నుండి సుదూర ప్రాంతాల వారు నేరుగా ఫిర్యాదులను సమర్పించి వారి సమస్యలను విన్నవించుకున్నారు. సమస్యలను తెలియజేసిన వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చి ఫిర్యాదుల పట్ల వారి సమస్యల పట్ల వెంటనే సిబ్బందిని కేటాయించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈరోజు వచ్చిన పిర్యాదులలో పొలానికి సంబంధించి 7, గొడవలకు సంబంధించి 1, ప్లాట్ ఇష్యూస్ సంబంధించి 3, ఇతర విషయాలకు సంబంధించి 3, మొత్తం 14 ఫిర్యాదులు అందాయి అని తెలిపారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల్, శాంతినగర్, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు టి. శ్రీను, శంకర్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలు

వనపర్తి, ఏప్రిల్ 20 ఉదయం ప్రతినిధి):

సమాజంలో మూఢనమ్మకాలు బలంగా ఉన్న పూర్వపు రోజుల్లో తన బోధనల ద్వారా ప్రజలను మూఢాచారాల నుండి కాపాడిన మహనీయుడు మహాత్మా బసవేశ్వర అని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కొనియాడారు. సోమవారం మహాత్మా బసవేశ్వర 893వ జయంతి వేడుకలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ బసవేశ్వర చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు బలంగా ఉన్న పూర్వపు రోజుల్లో తన బోధనల ద్వారా ప్రజలను మూఢాచారాల నుండి మహాత్మా బసవేశ్వర కాపాడారని అన్నారు. సమాజంలో కుల, వర్ణ లింగ వివక్షతకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. లింగవివక్షతను సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని అన్నారు. లింగాయత ధర్మం స్థాపించి చిరుప్రాయంలోనే శివపురాణం గాధలను అవగతం చేసుకున్న మహనీయుడని కొనియాడారు. సమానత్వాన్ని బోధించిన అభ్యుదయవాది మహాత్మ శ్రీ బసవేశ్వర జయంతిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించడం హర్షనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలోజడ్పీ సీఈఓ యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్, డివైఎస్వో సుధీర్ రెడ్డి, లింగాయతుల సంఘం నాయకులు, వీరశైవ మహాసభ నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి మెడ్వాన్ సంస్థ సహకారం

సంగారెడ్డి, వుదయం :





సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం తెల్ల రాళ్ల తండా ప్రాథమిక పాఠశాలలో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల చిన్నారులకు విద్యా సామగ్రి, క్రీడా సామగ్రి అందజేయడం విశేషం.ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రెస్సులు, బ్యాగులు, షూస్, నోట్ బుక్స్, టైలు, బెల్టులు, పెన్నులు, పెన్సిల్స్, స్లేట్స్ వంటి ఎడ్యుకేషన్ కిట్స్ పంపిణీ చేశారు. అదేవిధంగా క్యారం బోర్డు, చెస్, షటిల్ బ్యాట్స్, క్రికెట్ బ్యాట్స్, రింగ్ బాల్ వంటి క్రీడా సామగ్రిని కూడా అందించారు. విద్యార్థుల చదువుకు తోడ్పడేలా లైబ్రరీ పుస్తకాలను కూడా అందించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ హెచ్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి చిన్నారి ప్రభుత్వ పాఠశాలలోనే చదవాలని తమ సంకల్పమని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో సేవలు అందిస్తూ వచ్చినందున, పాఠశాలలో గణనీయమైన మార్పు కనిపిస్తున్నదని ఆయన అన్నారు. ఈ మార్పుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారం కీలకమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీబాయి మాట్లాడుతూ మెడ్వాన్ సంస్థ అందిస్తున్న సేవలు పేద కుటుంబాల పిల్లలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. సంస్థ సహకారంతో పాఠశాలపై తల్లిదండ్రుల నమ్మకం పెరిగిందని, ప్రభుత్వ పాఠశాల కూడా ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. విద్యార్థుల తరపున, తల్లిదండ్రుల తరపున సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరపున కూడా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను గుర్తించి వాటిని బలోపేతం చేయడం సమాజ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్. మధుసూదన్ రెడ్డి, ఎక్స్ సర్పంచ్ మచ్చ నరేందర్, సర్పంచ్ సుశీల మల్లేష్, ఉపసర్పంచ్ ఎం.నాము, ఎక్స్ ఉపసర్పంచ్ ఆర్. రాములు, అంగన్వాడి టీచర్ అంకుబాయ్, పంచాయతీ సెక్రటరీ నీరజ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం వంటి లక్ష్యాలకు మెడ్వాన్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## మహాత్మా బసవేశ్వర 893 జయంతి వేడుకలు

వికారాబాద్,( వుదయం బొంరాస్ పేట్ ప్రతినిధి):



కుల వ్యవస్థ అంటరానితనం అనే అంధకారాన్ని రూపు మాపడానికి ధైర్యంగా పోరాడిన గొప్ప సామాజిక సంస్కర్త మహాత్మా బసవేశ్వరని వక్తలు కొనియాడారు.వికారాబాద్ జిల్లా బొంరాస్ పేట మండల కేంద్రంలో మండల లింగాయత్ కమిటీ ఆధ్వర్యంలో ఏ మహాత్మా బసవేశ్వర 893 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ జయంతి వేడుకలకు జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ శేరి రాజేష్ రెడ్డి, రాష్ట్ర MGNREGS కౌన్సిల్ సభ్యుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12 వ శతాబ్దంలోనే "కాయేకల్ప" అంటూ శ్రమకు గౌరవ మిచ్చి కులవ్యవస్థను రూపుమాపి సమాజం లో సమానత్వం, కై పోరాడినగొప్ప సామాజిక సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని ఆయన ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముఖ్య అతిథితులతో పాటు వక్తలు పేర్కొన్నారు. ఈ జయంతి వేడుకలలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగి శెట్టి మల్లికార్జున్, మెట్ల కుంట pacas చైర్మన్ జయ కృష్ణ, AMC సభ్యులు మల్లేష్, సర్పంచ్ లు వీరేశ లింగం, వెంకటయ్య, నరసింహ నాయుడు, అంజిల్ రెడ్డి,మండల యువజన కాంగ్రెస్ నాయకుడు సంతోష్ నాయక్, మండల లింగాయత్ కమిటీ సభ్యులు ఉప్పు జగదీష్, రుమాండ్ల శశి శేఖర్, ఉమాపతి విజయ్, శంకర్ తదితరులున్నారు.

## బానుడి భగభగల్లో పోలీసులకు చల్లని ఊరట



- మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసిన బండి శివరాం రెడ్డి

నారాయణపేట, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):

భానుడి భగభగలకు జిల్లా కేంద్రం విలవిలలాడుతున్న వేళ, నిప్పులు చెరిగే ఎండను సైతం లెక్కచేయకుండా రహదారులపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసుల దాహార్తిని తీర్చేందుకు మానవత్వం స్పందించింది. సోమవారం వీర సావర్కర్ చౌరస్తా వద్ద 15వ వార్డు కౌన్సిలర్ బండి రాజేశ్వరి శివరాం రెడ్డి తన మిత్ర బృందంతో కలిసి పోలీసులకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేసి తన ఉదారతను చాటుకున్నారు.ప్రజా రక్షణ కోసం ఎండలో శ్రమిస్తున్న పోలీసుల కష్టాన్ని గుర్తించి, వారికి సంఘీభావంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం పట్ల టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో శాంతిభద్రతల కోసం నిరంతరం పరితపించే పోలీసులకు ప్రజల నుంచి లభించే ఇలాంటి ఆత్మీయ పలకరింపులు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలుపోలీసుల మధ్య ఈ తరహా సమన్వయం సామాజిక బంధాలను మరింత బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు.ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, తీవ్రమైన ఉక్కపోతతో సతమతమవుతున్న సిబ్బందికి ఈ మజ్జిగ పంపిణీ గొప్ప ఊరటనిచ్చిందని, తమ సేవలను గుర్తించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ షెడ్ మాజీ చైర్మన్ జయప్రకాష్ రెడ్డి, జయ ప్రకాశ్, మండ్రే రవి మరియు పోలీసు సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సమానత్వాన్ని చాటిన మహాత్మా బసవేశ్వరుడు

- బసవేశ్వరుని ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి,
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,
- ఎమ్మెల్యే కుచ్చకుళ్ళ డాక్టర్ రాజేష్ రెడ్డి

నాగర్ కర్నూల్ ,ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



వందల సంవత్సరాల క్రితమే కుల, వర్ణ, లింగ వివక్షను వ్యతిరేకించి సర్వ మానవ సమానత్వాన్ని చాటిచెప్పిన మహాత్ముడు బసవేశ్వరుడని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే కుచ్చకుళ్ళ డాక్టర్ రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నాడు
మహాత్మ బసవేశ్వరుడి జయంతి సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వరుడి జయంతి వేడుకలకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి హాజరై బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
అనంతరం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., బసవేశ్వరుడు సాంప్రదాయక సమాజంలో కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన ఒక అభ్యుదయ వాది అని తెలిపారు మానవతా విలువలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆ మహనీయుడి ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని తెలిపారు.
బసవేశ్వరుడి మార్గంలో ప్రతీఒక్కరు నడవాలని, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప సంస్కర్త మహాత్మా బసవేశ్వరుడని, ఆయన బోధించిన అభ్యుదయవాద సంప్రదాయమే నేడు లింగాయత్ ధర్మంగా మారిందన్నారు. 12వ శతాబ్దంలోనే మహిళలకు సముచిత స్థానం కల్పించారని, బసవేశ్వరుడు చెప్పిన సిద్ధాంతాలను కేవలం మాటల్లో కాదు, మన జీవితాల్లో ఆచరణలో పెట్టి ఆయన చూపిన మార్గంలో నడిచినప్పుడే ఆయనకు మనం నిజమైన గౌరవం తెలిపినట్లవుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ....., మూఢనమ్మకాల పైన నిరంతరం పోరాటం చేసిన మహానుభావుడు బసవేశ్వరుడు అన్నారు. ప్రప్రథమ సంఘసంస్కర్త సమతవాది అని ఎమ్మెల్యే ప్రశంసించారు. అణగారిన వారి వర్గాల పట్ల ఆశావాది నిరంతర మార్గదర్శకుడని, బసవేశ్వరుని మార్గాన్ని ముందుకు సాగాలని, సమాజ అభివృద్ధికి పాటుపడాలని ఆయన తెలిపారు. ఆ రోజుల్లోనే స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించారని ఎమ్మెల్యే అన్నారు. లింగాయత్ కుల సంఘ నాయకులు నాగర్ కర్నూల్ పట్టణంలో బసవేశ్వరుని విగ్రహం బసవేశ్వర భవన ఏర్పాటుకు కృషి చేయాలని కోరగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ శాఖ అధికారి శ్రీరాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు జెమిని సురేష్, జిల్లా ప్రెసిడెంట్ గిరిజ శంకర్, సెక్రెటరీ రాజేష్, మమ్మాయిపల్లి రాజు, మహదేవన్పేట రవిశంకర్, రాజేష్ వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

## వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



సంక్షేమ వసతి గృహాలను సంబంధిత సిబ్బంది శుభ్రంగా ఉంచుకుంటేనే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటారని అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో అదనపు కలెక్టర్ సోమవారం గద్వాలలోని బీసీ బాలికల సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహం లోని వంటశాలను, స్నానపు గదులు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. వండిన ఆహార పదార్థాలను పరిశీలించి విద్యార్థులకు ఎప్పటికప్పుడు రుచికరమైన వంటలను వండించి పెట్టాలన్నారు. వసతి గృహ వాష్రూమ్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యం బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ వారికి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రస్తుతం అక్కడ కల్పించిన సౌకర్యాల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు. వసతిగృహ విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఇలాగే ఎల్లప్పుడూ సజావుగా నిర్వహించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టరు వార్డెన్ కు, అక్కడి సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సుషిత, వసతి గృహ వార్డెన్ ప్రమీల, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బసవన్న గారి సందేశం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకం




- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, ఏప్రిల్ 20( వుదయం):

వృత్తిని దైవకార్యంగా భావించి కష్టపడి పనిచేయటమే నిజమైన దేశభక్తి అని బసవన్న గారి సందేశం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బసవేశ్వర 893వ జయంతోత్సవం సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బసవన్న సాంప్రదాయక సమాజంలో కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది అని పేర్కొన్నారు. మానవతా విలువలను ఆచరణలో పెట్టడం ద్వారా ఆయన ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని తెలిపారు. కష్టపడి పని చేయడమే నిజమైన దేశభక్తి అనే బసవన్న గారి సందేశం నేటికీ కాలానుగుణ ప్రాముఖ్యతను కలిగి ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ మెదక్ జిల్లా అధ్యక్షుడు లింగన్న గారి మల్లప్ప, గౌరవ అధ్యక్షుడు పి.డి ఆనందం, జిల్లా జనరల్ సెక్రటరీ వీరేశం, కోశాధికారి ప్రభు కుమార్ శెట్టి, శ్రీకాంత్, నత్తటి సందీప్ కుమార్ తదితరులు, వీరశైవ లింగాయత్ సభ్యులు పాల్గొన్నారు.

## బసవేశ్వరుని ఆశయాలు అందరికీ ఆదర్శం

- జిల్లా కలెక్టర్ కె. హైమావతి

సిద్ధిపేట, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



సమాజంలో సమానత్వం కోసం, సామాజిక మార్పు కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా బసవేశ్వరుడు అని, ఆయన ఆశయాలు నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. సోమవారం శ్రీ బసవేశ్వర జయంతి ఉత్సవాల సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.సిద్ధిపేట అర్బన్ మండలం పొన్నాల బైపాస్ చౌరస్తా వద్ద ఉన్న బసవేశ్వర విగ్రహానికి కలెక్టర్ కె. హైమావతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడు సమాజానికి అందించిన సందేశాన్ని స్మరించుకున్నారు. కులమతాలకు అతీతంగా 'కాయకమే కైలాసం' అని చాటిచెప్పిన బసవేశ్వరుని అడుగుజాడల్లో నడవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు బసవేశ్వరుడు చేసిన పోరాటం మరువలేనిది కలెక్టర్ కొనియాడారు. పొన్నాల బైపాస్ చౌరస్తా వద్ద జరిగిన ఈ జయంతి వేడుకలతో సిద్ధిపేటలో ఆధ్యాత్మిక మరియు సామాజిక చైతన్యం వెల్లివిరిసింది.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సయ్యద్ రఫీ, వివిధ కుల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రిడేషన్లలో జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

- టి యు డబ్ల్యూ జే (హెచ్ 143) ఆధ్వర్యంలోజిల్లా కలెక్టర్ అక్రిడేషన్ కమిటీ చైర్మన్ బాధావత్ సంతోష్ కు వినతి

నాగర్ కర్నూల్, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



జిల్లా లోని జర్నలిస్టుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమవారం జిల్లా జర్నలిస్ట్ అక్రిడేషన్ కమిటీ చైర్మన్,కలెక్టర్ బాధావత్ సంతోష్ కు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (H143) ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశం అనంతరం తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (H143) జిల్లా అధ్యక్షుడు అక్రిడేషన్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర రావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘం జిల్లా అధ్యక్షుడు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు ఖానాపురం ప్రదీప్, తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్(టీజేఏ) జిల్లా బాధ్యులు, అక్రిడేషన్ కమిటీ సభ్యులు మహమ్మద్ దస్తగీర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. ప్రధానంగా నాగర్ కర్నూల్ జిల్లాలోని అమరాబాద్ టైగర్ రిజర్వ్ (నల్లమల) లోని మన్ననూర్, దోమలపెంట (బ్రహ్మగిరి) జర్నలిస్టులకు అక్రిడేషన్లను మొదటి లిస్టులోనే అందించే విధంగా చర్యలు తీసుకోగలరనీ కోరారు.ప్రధానంగా సమాచార పోరా సంబంధాల శాఖ సైట్ లో ఈ రెండు సెంటర్లకు సంబంధించిన వివరాలు లేకపోవడంతో ప్రతి అక్రిడేషన్ జారీ చేసే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయనీ పేర్కొన్నారు. శాశ్వతంగా ఈ రెండు సెంటర్లకు గుర్తింపు కల్పిస్తూ శాశ్వత పరిష్కారం చూపగలరని కోరారు. అటవీ ప్రాంతంలో శ్రీశైలం ప్రాజెక్టు, లెఫ్ట్ బ్యాంక్ పవర్ ప్లాంట్, వరకు మన్ననూర్ & దోమల పెంట (బ్రహ్మగిరి) కేంద్రాలకు చెందిన రిపోర్టర్ల పాత్ర కీలకమైనదనీ పేర్కొన్నారు. వారి ప్రాధాన్యతను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపగలరని కోరారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా తో పాటు రంగారెడ్డి జిల్లాలో కూడా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే విధంగా వెసులుబాటును కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ ( H143) నాగర్ కర్నూల్ జిల్లా కమిటీ ద్వారా కోరుతున్నాము. కడ్తాల్ వరకు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల పరిధి ఉంటుంది కాబట్టి ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించారని కోరగా ఈనెల 25వ తేదీన జరిగే అక్రిడేషన్ కమిటీ సమావేశంలో అందరూ సభ్యుల సమక్షంలో తీర్మానం చేసి సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ కు నివేదిస్తామని కలెక్టర్ బాధావత్ సంతోష్ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కలెక్టర్ అంశాల గురించి సానుకూలంగా స్పందించారని వారు వివరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్ధిపేట, ఏప్రిల్ 20 (వుదయం ప్రతినిధి):



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకే జిల్లా యంత్రాంగం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ హమీద్ పేర్కొన్నారు. సోమవారం సిద్ధిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (కలెక్టరేట్) లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీ కిరణ్ తో కలిసి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి వినతులను స్వీకరించారు.

**అధికారులకు కఠిన ఆదేశాలు:**

దరఖాస్తుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడిన అదనపు కలెక్టర్, వారి సమస్యల తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "ప్రజావాణికి వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకూడదు. బాధితులు మళ్లీ మళ్లీ కలెక్టరేట్ చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి నిబంధనల ప్రకారం సత్వరమే న్యాయం చేయాలి" అని ఆదేశించారు.బాధితులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలి. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలి.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

## దేవాలయ నిర్మాణానికి 51 వేల విరాళం అందజేత



- సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్

వెల్దండ, ఏప్రిల్ 20 (వు దయం) :

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెనకేశవ స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం స్థానిక సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆలయ కమిటీ సభ్యులు, సందర్భంగా స్పందించిన ఆయన కమిటీ సభ్యుల సూచన మేరకు ఆలయ నిర్మాణం కోసం 51000 వేల రూపాయలు అందజేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కున పాండు వార్డ్ మెంబర్ శేఖర్,ఆనంద్, నీరాజన్ బలరాం ,జగిలి ఆనంద్ ,గోరటి భరత్ ,డేవిడ్,రాజు ,చందరమౌళి ,శ్రీనివాస్ ,వెంకటేష్ ,సంజీవ,చిన్న,సుధాకర్ ,కిరణ్,అంజి తదితరులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం





**కాగజ్ నగర్ (వుదయం ప్రతినిధి )** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని బీట్ మార్కెట్లో మార్క్ ఫెడ్ మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్కలు పండించిన రైతుల కోరిక మేరకు, వారికి పూర్తి మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మరియు ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావుల తో మాట్లాడి సిర్పూర్ నియోజకవర్గంలో రెండు మక్కల కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. ఒక మక్కల కొనుగోలు కేంద్రాన్ని ఈ సోమవారం కాగజ్ నగర్ లో ప్రారంభించడం జరిగిందని, రెండో మక్కల కొనుగోలు కేంద్రం కౌటాలలో ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు దళారులకు తక్కువ రేటుకు మక్కలు అమ్ముకోకుండా, రూ.2400 మద్దతు ధర పొందవచ్చునని చెప్పారు. ఈ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, డీసీఓ మోహన్, అగ్రికల్చర్ అధికారులు రామకృష్ణ, నాగరాజు, గిరిషన్, కార్తీష, ప్రేమలత, పీఏసీఎస్ కార్యదర్శి సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను

# త్వరగా పరిష్కరించాలి

### పలు సమస్యలపై వినతులు స్వీకరించిన కలెక్టర్ సత్యప్రసాద్




**జగిత్యాల (వుదయం ప్రతినిధి)** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అదేశించారు సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదనపు కలెక్టర్ ఆర్డీఓ లతో కలిసి స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు మండలాల నుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా తేదీ 20 4 2026 నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 63 ఫిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బిఎస్ లత స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి రాజ గౌడ్ కోరుట్ల మెట్ పెల్లి ఆర్డీవోలు జీవాకర్ రెడ్డి నరసింహ రావు వివిధ శాఖల జిల్లా అధికారులు తహసీల్దార్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## రేకుర్తి హిందూ సమ్మేళనంలో అలరించిన చిన్నారుల నాట్యప్రదర్శన




**కరీంనగర్ (వుదయం ప్రతినిధి)** నగరంలోని రేకుర్తి సాయి మహాలక్ష్మీ ఫంక్షన్ హాల్లో ఆదివారం రాత్రి నిర్వహించిన హిందూ సమ్మేళనంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించాయి.ప్రముఖ కూచిపూడి నృత్య శిక్షకురాలు వేల్పుల స్వప్న కుమారి వద్ద కూచిపూడి నృత్య సాధన చేస్తున్న చిన్నారులు సుహానీ, హియస్వి, శరణ్య,శృతి, దేవణ్షి, మయూఖ, స్ఫూర్తి, విఙ్ఞ లు ప్రదర్శించిన నాట్య ప్రదర్శనలు హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కార్యక్రమం నిర్వాహకులు నృత్య శిక్షకురాలు వేల్పుల స్వప్న కుమారి, చిన్నారులను అభినందించారు.

## మెల్లకుంట తండాలో రాజకీయ ఉద్రిక్తత

**నాగిరెడ్డిపేట, వుదయం**



మెల్లకుంట తండా గ్రామపంచాయతీ పరిధిలో రాజకీయ వాతావరణం రోజురోజుకు వేడెక్కుతోంది. ఇటీవల నూతన గ్రామపంచాయతీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన సభలో మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేసిన వ్యాఖ్యలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఆయన ప్రస్తుత ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అభివృద్ధి చేయలేదని, గతంలో కేసీఆర్ నాయకత్వంలోనే అభివృద్ధి జరిగిందని చేసిన విమర్శలకు ప్రతిస్పందనగా ఆదివారం మెల్లకుంట తండా కాంగ్రెస్ నాయకులు సమావేశమై బహిరంగంగా ఘాటు కౌంటర్ ఇచ్చారు.

**తండాల నాయకులు భారీగా హాజరు**

ఈ సమావేశంలో మెల్లకుంట తండాతో పాటు బేజగం చెరువు, తదితర తండాల నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వారు విపులంగా వివరించారు. మాజీ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ, అవి పూర్తిగా వాస్తవాలకు విరుద్ధమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పల్లె బోగడ తండా సర్పంచ్ పార్వతీశంకర్, గ్రామ అధ్యక్షుడు హరి, మెల్లకుంట తండా ఉపసర్పంచ్ రామావత్ వసురం, మాజీ సర్పంచ్ కొర్ర కేస్లీ వసురం నాయక్, బెజగం చెరువు తండా గ్రామ అధ్యక్షుడు గోపి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు వర్జా నాయక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లతో మారుతున్న తండా రూపురేఖలు**

మాజీ సర్పంచ్ కొర్ర కేస్లీ వసురం నాయక్ మాట్లాడుతూ, గత టీఆర్ఎస్ పాలనలో పేదల పట్ల నిర్లక్ష్యం జరిగిందని ఆరోపించారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల అమలులో ఆలస్యం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిస్థితి మారిందని పేర్కొంటూ, మెల్లకుంట తండాలో ఇందిరమ్మ ఇళ్ల కింద 11 ఇళ్లు మంజూరు కాగా, అందులో 8 పూర్తయ్యాయని, మిగిలినవి తుది దశలో ఉన్నాయని వెల్లడించారు.

**రాజకీయ వేడి మరింత పెరుగుతోంది**

మొత్తంగా మెల్లకుంట తండాలో రాజకీయ వేడి రోజురోజుకు పెరుగుతోంది. మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలకు కాంగ్రెస్ నాయకులు ఘాటు కౌంటర్ ఇవ్వడంతో స్థానిక రాజకీయాలు మరింత ముదురుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వివాదం మరింత తీవ్రరూపం దాల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## మహనీయుల ఆశయాలు కొంసాగించాలి



**జగిత్యాల (వుదయం ప్రతినిధి)** జిల్లా కలెక్టరేట్ లో తత్వవేత్త సామాజిక సంస్కర్త మహాత్మ బసవేశ్వర (బసవన్న) జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బసవేశ్వరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ 12వ శతాబ్దపు తత్వవేత్తగా బసవేశ్వరుడు సమానత్వాన్ని బోధించారని అనునభవ మంటపం స్థాపించారని అన్నారు కుల లింగ వర్ణ విభేదాలను వ్యతిరేకించిన మహాత్మా బసవేశ్వరుని తత్వాలు దేశ వ్యాప్తంగా ప్రభావం చూపాయని అన్నారు సమాజంలో అహింస ద్వారా సమాజానికి మంచి మార్గాన్ని ఎన్నుకొని జీవించేలా బసవేశ్వడు బోధనలు చేశాడని గుర్తు చేశారు సమానత్వం సత్యం న్యాయం వంటి మహోన్నత విలువలను మన జీవన విధానంగా మార్చాలని బోధించిన మహానుభావుడు బసవన్న అట్టడుగు వర్గాల ప్రజలు ఉన్నతంగా జీవించే విధంగా బసవేశ్వరుడు బరోసా కల్పించాడన్నారు సమాజ హితం కోసం పాటుబడిన బసవేశ్వరుడి మార్గం అందరికి ఆచరణీయమన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్ లత బి రాజగౌడ్ జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి జి సునీత జిల్లా స్థాయి అధికారులు వివిధ స్థాయిల అధికారులు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆలయ నిర్మాణానికి విరాళం



**జన్నారం, 0(వుదయం విలేఖరి)** మంచిర్యాల జిల్లా అఖిల భారత విశ్వకర్మ సంఘం అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ జన్నారం పంచాయతీ సుందరయ్య నగర్ కాలనీలో నూతన హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం రూ.5,116 విరాళం అందజేశారు.ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ దేవిదాస్, కామెర కవిత, సవాయి రామ్, జయ మంజులకు ఆయన అందజేశారు. కమిటీ సభ్యులు గంగాధర్‌ను ఘనంగా సన్మానించారు.


## అంగన్‌వాడీ టీచర్లకు సెల్‌ఫోన్ల పంపిణీ

**జన్నారం, (వుదయం విలేఖరి)**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం నుంచి మంజూరైన సెల్‌ఫోన్లను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణ,వైస్ చైర్మన్ ఫస్సిఉల్లాహ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,ఎమ్మార్వో బక్కయ్య,ఎంపీడీఓ ఉమర్ షరీఫ్,సీడీపీఓ,సూపర్‌వైజర్లు,అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.ప్రభుత్వ పథకాల సమాచారాన్ని వేగంగా చేరవేసేందుకు, పిల్లల, గర్భిణుల డేటా నమోదుకు ఈ ఫోన్లు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు.



## ఇళ్ల గణనపై పూర్తి అవగాహన అవసరం



**ఆసిఫాబాద్, (వుదయం ప్రతినిధి):** అసిఫాబాద్‌లోని జిల్లా పరిషత్ సెకండరీ బాలుర పాఠశాలలో జనాభా గణన-2027 తొలి విడత ఇళ్ల గణనపై ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హరిత హాజరై మాట్లాడుతూ, మే 11 నుంచి జిల్లాలో ఇళ్ల గణన ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతి అంశంపై పూర్తి అవగాహనతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా గణన ప్రక్రియను నిర్వహించాలని సూచించారు.హౌసింగ్ బ్లాకులపై స్పష్టమైన అవగాహన ఉండాలని, కచ్చితత్వంతో వివరాలు నమోదు చేయడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. అధికారులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

## మాజీ మంత్రి కొప్పుల పుట్టినరోజు వేడుకలు

**ధర్మపురి, (వుదయం ప్రతినిధి):** మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను సోమవారం ధర్మపురి పట్టణంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించా యి. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ స్థానిక ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. అనం తరం పట్టణంలోని నంది చౌక్ వద్ద పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సంగి శేఖర్, చిలువేరి శ్యాంసుందర్, పెరుమాండ్ల ఎల్లగౌడ్, చిర్నేని నర్సయ్య, బండారి అశోక్, చుక్క రవి,బాకీ శేఖర్,గుర్రాల సుధాకర్, మురికి శ్రీనివాస్, అనంతుల విజయలక్ష్మి,ఎండీ షమీమా, తరాల కార్తీక్, సయ్యద్ ఆసిఫ్, జెట్టి రాజన్న, ఆనందాసు శ్రీనివాస్, స్తంభంకాడి మహేష్, నక్క రాజేందర్, ముత్తినేని లక్ష్మణ్, మామిడి శ్రీనివాస్, అక్కనపెల్లి సురేందర్, చల్ల రవి, కాశెట్టి విజయ్, కుక్కల గంగారెడ్డి, కాశవేని శ్రీనివాస్, అనంతుల లక్ష్మణ్, పాల్గొన్నారు.



## జన్నారంలో చంద్రబాబు జన్మదిన వేడుకలు

**జన్నారం, ( వుదయం విలేఖరి)**

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన చేతుల మీదుగా ప్రారంభమైన జన్నారం ప్రాథమిక ఆసుపత్రి వద్ద సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.టీటీడీపీ ఆదిలాబాద్ జిల్లా పార్లమెంటరీ అడ్‌హాక్ కమిటీ సభ్యులు పులిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి చంద్రబాబుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు గంధం పద్మారావు, మండల యువనాయకులు కటకం కోటేశ్, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చంద్రబాబు ప్రజాసేవలను, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## కళాశాల పరిసరాలను

# శుభ్రంగా ఉంచుకోవాలి

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**

మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మైనారిటీ అధికారి ఎంఏ రషీద్ అన్నారు. సంక్షేమ వారోత్సవాలలో భాగంగా సోమవారం నారాయణపేట లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్నానాల గదులు మరుగుదొడ్లు తనకి చేశారు.ఈ ఎ పి సెట్ క్రాష్ కోర్స్ విద్యార్థులతో మాట్లాడి వంటగది ప్రాంగణాన్ని పరిశీ లించారు. మరుగుదొడ్లతో సహ ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ప్రిన్సిపల్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.



# చదువుల పండగ సందర్భంగా ప్రతిభ పోటీలు

**నారాయణపేట టౌన్ (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట మండలం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవా రం మండల స్థాయి చదువు ల పండుగ 2.0 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. చదువుల పండుగ అనేది కేవలం పోటీ కాదు, విద్యార్థు లలో దాగి ఉన్న సృజనాత్మక తను, నైపుణ్యాలను వెలికి తీసే వేదిక అన్నారు. ప్రతిభా పోటీల్లోమండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో మన మండల పేరు నిలబెట్టాలన్నారు. పుస్తకా లతో పాటు ఆటలు, పాట లు, చిత్రలేఖనం, వక్తృత్వం వంటి అంశాల్లో రాణించడమే సంపూర్ణ విద్య అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయు లు సమిష్టిగా కృషి చేస్తే ప్రతి విద్యార్థి విజేతే అని పేర్కొ న్నారు.ఈ పోటీలు మూడో తరగతి నుండి ఏడో తరగతి వరకు నిర్వహించడం జరిగిం దనీ తెలిపారు. మండలం లోని వివిధ పాఠశాలల తెలుగు ఆంగ్లము గణితము, క్విజ్ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి చదువుల పండుగ 2.0 కి ఎంపిక చేశారు.ప్రథమ బహు మతి పొందిన విద్యార్థులు మాత్రమే జిల్లా స్థాయి పోటీ లో పాల్గొనాలనిఎంపికైన విద్యార్థులకు ఎంఈఓ బాలాజీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను,



ప్రధానో పాధ్యాయులను ఈ సంద ర్భంగా ఎంఈఓ అభినందిం చారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ప్రధానోపాధ్యాయురాలు భారతి, జిల్లా సైన్స్ అధికారి హెచ్ భాను ప్రకాష్ , వివిధప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు అనురాధ,భీమే శ్వరి సునీత కృష్ణారెడ్డి రాజేశ్వరి,పవన్ ,అర్చన, శ్రీకాంత్ ,నర్సింలు,డిఆర్పిలు స్వామి, భీమప్ప ,శ్రీనివాస్ ఎమ్మార్పీలు బాలకృష్ణప్ప, వెంకటేష్, చిన్న నరసింహు లు,రాజేష్ ,చంద్రకాంత్, వివిధ పాఠశాలల విద్యార్థు లు పాల్గొన్నారు.

## బసవేశ్వరుని బోధనలు అనుసరణీయం

### అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, నర్సింగరావు



**గద్వాల (వుదయం ప్రతినిధి)** కుల, మత, లింగ భేదాలను తీవ్రంగా వ్యతిరేకించి సమాజంలో స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని నినదించిన బసవేశ్వరుని బోధనలు అనుసరణీయమని అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు అన్నారు. విశ్వగురు బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకొని సోమవారం గద్వాల ఐడిఓసి వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి అధికారులు, వీరశైవ సంఘం నేతలు పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ పాల్కురికి సోమనాథుడు బసవ పురాణం ద్వారా కర్ణాటకకు చెందిన బసవన్న జీవితాన్ని తెలుగులో ప్రసిద్ధి చేశారన్నారు. బసవన్న తన వచన సాహిత్యంతో ప్రజలందరిని కులమతాలకతీతంగా ఏకం చేశారన్నారు. ఆయన బోధనలలోని సమదృష్టి ఎందరినో ఆకర్షించిందని, సూక్ష్మమైన తత్వం సులువుగా బోధపడేదని పేర్కొన్నారు. పలువురు జిల్లా అధికారులు, వీరశైవ సంఘం నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా నిర్వహించిన మహాత్మ బసవేశ్వర మహారాజు జయంతి

**వికారాబాద్ (వుదయం బ్యూరో)** వికారాబాద్ లో మహాత్మ బసవేశ్వర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ బసవేశ్వర భవన్లో జరిగిన ఉత్సవాల్లో పాల్గొనగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆలంపల్లి రోడ్ లో ఉన్న బసవేశ్వర విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా ఉత్సవాల్లో పాల్గొన్నారు. వికారాబాద్ కలెక్టరేట్లో కలెక్టర్ దీపక్ తివారి బసవేశ్వర మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసిన వాళ్ల అర్పించారు.

**మహాత్మ బసవేశ్వర మహారాజు చరిత్ర ఏమిటి...!**

బీసీలు, మహిళలు, ఇతర వర్గాలు చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం కొట్లాడుతున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలపై ఇప్పటికీ అనేకచోట్ల పోరాటాలు జరుగుతున్నాయి. కానీ, ఎప్పుడో శతాబ్దాల కిందటే కుల, మత, వర్గ, వర్ణ వ్యవస్థలను, అసమానతలను రూపుమాపేందుకు సమరభేరి మోగించిన గొప్ప సంఘసంస్కర్త బసవేశ్వరుడు.నేటి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాగేవాడిలో క్రీ.శ.1134లో ఆనందనామ సంవత్సరంలో జన్మించిన బసవేశ్వరుడు వీరశైవ సంప్రదాయాన్ని మహోజ్వలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప భక్తుడు. లింగాయత ధర్మ సృష్టికర్త, విశ్వగురువు, మహా మానవతావాది. స్త్రీ, పురుష అసమానతలను తొలగించడానికి కృషి చేసిన అభ్యుదయవాది బసవేశ్వరుడు. బాల్య వివాహాలు, సతీ సహగమనం వంటి దురాచారాలను రూపుమాపేందుకు ఆయన ఆనాడే కృషి చేశారు. దురాచారాలు స్వార్థపరుల సృష్టి అంటూ వాటిపై సమరభేరి మోగించారు. తద్వారా సర్వసమానత్వమే శాంతికి మూలమని ఉపదేశించారు. అదే లింగాయత ధర్మం. అనాదిగా వస్తున్న మూఢ నమ్మకాలను, ఆచారాలను బసవణ్ణ తీవ్రంగా ఖండించారు. ఆయనకు పూర్వం స్త్రీలకు, పంచములకు ధార్మిక, సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కులు ఉండేవి కావు. బసవణ్ణ ఆగమనంతో అందరూ అన్ని బంధాల నుంచి విముక్తి పొందారు. సమాజ నిర్మాణంలో ఆయన దార్శనికత, నాయకత్వం ఇప్పటికీ స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. బసవణ్ణకు పూర్వపు యుగంలో పంచములకు, వెనుకబడిన కులాల వారికి దేవాలయంలోకి ప్రవేశం ఉండేది కాదు. దాన్ని రూపుమాపే ఉద్దేశంతో సమ సమాజ స్థాపన కోసం దేవుడినే భక్తుడి వద్దకు తీసుకురావడానికి ఇష్టలింగాన్ని బసవేశ్వరుడు కనిపెట్టారు. పరమ శివునికి ప్రతిరూపమైన ఇష్టలింగాన్ని చేతికిచ్చి గుడి సంస్కృతిని, కుల వ్యవస్థను అంతమొందించారు. ఆచార పారాయణులు పంచములను గుడిలోపలకి రానివ్వనపుడు ఆ గుడిలోని లింగాన్ని తెచ్చి వారి ఒడిలో ఉంచిన మహనీయుడు బసవణ్ణ. మాంసాహారాన్ని త్యజించి శాకాహారాన్ని స్వీకరించడం ఇష్టలింగాదరణ, ఇష్టలింగ పూజ. ఇదే బసవణ్ణ సూచించిన భక్తి మార్గం. మనుషుల మధ్య, మతాల మధ్య సామరస్యం ఉండాలని ఆకాంక్షించిన ఆయన మొట్టమొదటి కులాంతర వివాహం చేసి సమాజ గమనాన్ని ప్రభావితం చేశారు. అందులో జాతి, కుల, వర్గ, వర్ణ భేదాలు లేకుండా అందరికి సమాన అవకాశం కల్పించిన అపూర్వ ప్రజాస్వామ్యవాది బసవణ్ణ. నేటి ప్రభుత్వాలు, పాలకులు బసవేశ్వరుడిని ఆదర్శంగా తీసుకోవాలి. బీసీలు, మహిళలు, బలహీనవర్గాలకు చట్టసభల్లో అడుగుపెట్టేందుకు అవకాశం కల్పించాలి.



# చక్కని ఆరోగ్యం

# 'కాకర' చేదు తగ్గాలంటే..!



కాకరకాయ అనగానే మొహం చిట్లించుకుంటారు చాలామంది. ఇది చేదుగా ఉండడమే ఇందుకు కారణం. చేదు పోగొట్టడానికి ముక్కల్ని ఉడికించడం, ఉప్పు కలపడం.. వంటి ప్రయోగాలు చేసే వారూ లేకపోలేదు. కానీ ఇవి కొంతమందికి వర్కవుట్ కాకపోవడంతో ఈ కాయగూరను పక్కన పెట్టేస్తుంటారు. అయితే ఈ అవసరం లేకుండా కొన్ని సింపుల్ చిట్కాలతో కాకరలోని చేదును తగ్గించుకోవచ్చంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందాం రండి..

కాకరపై తొక్కను పైపైన చెక్కేయాలి. ఇప్పుడు వీటిని సన్నటి స్లైసుల్లా తరిగి.. రెండు మూడు గంటలు ఎండలో పెట్టాలి. దీనివల్ల కాకరలోని తేమ శాతం తగ్గి ఆటోమేటిక్‌గా చేదు కూడా తగ్గుతుంది. ఈ స్లైసులతో కూర వండుకుంటే అంత చేదుగా కూడా ఉండదంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ఇలా ఎండ బెట్టడం వల్ల ఈ ముక్కల షెల్ఫ్ లైఫ్ కూడా పెరుగుతుందట! వీటిని ఫ్రిజ్‌లో నిల్వ ఉంచుకొని ఆ తర్వాత కూర చేసుకోవడం, స్నాక్స్‌లో వాడడం.. వంటివి చేయచ్చు. చాలామంది కాకరలోని చేదు తగ్గాలని ఉప్పు కలుపుతుంటారు. అయితే ఉప్పుతో పాటు చిటికెడు పసుపు కూడా కలిపి.. ఈ ముక్కల్ని జాలీలో ఉంచి ఓ గిన్నెపై పెట్టాలి. ఫలితంగా ఉప్పు, పసుపుల మిశ్రమం కాకరలోని చేదును గ్రహించి ద్రవరూపంలో గిన్నెలోకి చేరుతుంది. ఫలితంగా చేదు తగ్గుతుందట. ఆపై ఈ ముక్కల్ని కూర చేసుకుంటే రుచిగా ఉంటుంది. పకోడీ, బజ్జీలు.. వంటివి చేసేటప్పుడు కొంతమంది ఆ పిండిలో కాయగూర ముక్కల్నీ వాడుతుంటారు. అయితే ఇలా నూనెలో డీప్‌ఫ్రై చేసే స్నాక్స్ తయారీలో కాకర ముక్కల్ని వాడితే వాటిలోని చేదు తగ్గుతుందంటున్నారు నిపుణులు. కొంతమంది కాకరకాయల్ని గింజలతో పాటు వండేస్తుంటారు. దీనివల్ల కూడా కూర చేదుగా ఉంటుంది. కాబట్టి కాకరకాయ అస్సలు తినలేమని అనుకునేవారు గింజలు తొలగించి వండుకుంటే చేదు కాస్త తగ్గే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. ఒక గిన్నెలో కప్పు నీళ్లు, కప్పు వినెగర్, రెండు టేబుల్‌స్పూన్ల చక్కెర వేసి కలపాలి. ఈ మిశ్రమంలో కాకర ముక్కల్ని వేసి అరగంట పాటు ఉంచాలి. దీనివల్ల కూడా చేదు తగ్గుతుందట! ఆపై శుభ్రం చేసుకొని వండుకుంటే సరిపోతుంది. నీళ్లు మరుగుతున్నప్పుడు అందులో టీస్పూన్ ఉప్పు వేయాలి. ఈ మిశ్రమంలో కాకర ముక్కల్ని వేసి మరో రెండు నిమిషాల పాటు మరిగించాలి. ఆపై వేడి నీళ్లు వంపేసి చల్లటి నీటిలోకి ముక్కల్ని మార్చాలి. ఈ చిట్కా కూడా కాకరలోని చేదును తగ్గిస్తుందట! ఇలా ఉడికించడం వల్ల ముక్కలూ మృదువుగా మారతాయి. కూర రుచీ పెరుగుతుంది. కాకరకాయతో వివిధ రకాల వంటకాలు తయారుచేసేటప్పుడు.. అందులో కొద్దిగా బెల్లం ముక్క వేయాలి. దీనివల్ల కూడా ఫలితం ఉంటుందట. కాకర ముక్కల్ని పెరుగుతో మ్యారినేట్ చేసి గంట పాటు వదిలేయాలి. ఆపై కూర చేసుకుంటే రుచికి రుచి.. చేదుగా కూడా ఉండదంటున్నారు నిపుణులు. ఈ ముక్కల్ని వండే ముందు గట్టిగా పిండితే.. అందులోని నీళ్లు బయటికి రావడం గమనించచ్చు. ఇలా దీనిలోని చేదు కొంతవరకు బయటికి వెళ్లిపోయే అవకాశం ఉంటుందట!

# మొటిమా... పొట్ట జాగ్రత్త!

ముఖం మీద మొటిమ... ప్రతి అమ్మాయినీ బాధించే విషయమే! ఇది రావడం ఆలస్యం... క్రీములు పడట్లేదు, నెలసరి దగ్గరికొస్తోంది అంటూ ఏవేవో కారణాలు వెతుకుతాం. పొట్ట కూడా కారణమే అని తెలుసా? మన గట్ లేదా జీర్ణవ్యవస్థలో కోట్లకొద్దీ మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇవి జీర్ణప్రక్రియ సరిగా జరిగేలా చూడటమే కాదు ఇన్‌ఫ్లమేషన్‌కి అడ్డుకట్ట వేస్తాయి.



అంతేకాదు, రోగనిరోధక శక్తి పెరగడానికీ సాయపడతాయి. మనం ఏమాత్రం అనారోగ్యకరమైన, విపరీతమైన జంక్, చక్కెరలున్న ఆహారం తీసుకున్నా శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌కి కారణమవుతాయి. యాక్నే, మొటిమలు వంటివాటికి దారి తీస్తాయి. దీన్నే గట్ – స్కిన్ యాక్సిస్ అంటారు నిపుణులు. జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా లేకపోతే ఇన్సులిన్, ఆండ్రోజన్ వంటి హార్మోన్లమీదా ప్రభావం పడుతుంది. దీంతో చర్మంపై నూనెలు అధికంగా విడుదలై మొటిమలకు కారణమవుతాయి. ఒత్తిడి, నిద్రలేమి కూడా ఇలాంటి ప్రభావమే చూపిస్తాయి. ఇవి కార్టిసాల్ విడుదలకు కారణమవుతాయి. చర్మం తనంతట తాను చికిత్స చేసుకోవడంలో అడ్డుపడతాయి. అందుకే ఎన్ని క్రీములు వాడినా మొటిమలు త్వరగా తగ్గవు లేదంటే వెంటవెంటనే వచ్చేస్తుంటాయి. కాబట్టి, వీటిమీదే ఆధారపడకుండా గట్ హెల్త్, ఒత్తిడి తగ్గించుకోవడం, వేళకు నిద్రపోవడం వంటివాటిపైనా దృష్టిపెట్టండి. సరైన జీవనశైలిని అలవరచుకోండి. అప్పుడే అందమైన, ఆరోగ్యకరమైన చర్మం మీ సొంతం.

# చీమల బెడద పోవాలంటే..!

వేసవి కాలంలో ఇంటా, బయటా చీమల బెడద ఎక్కువగా ఉండడం గమనిస్తుంటాం. ఏ ఆహార పదార్థం కనిపిస్తే దాన్ని చుట్టుముట్టేయడం చూస్తుంటాం. ఈ క్రమంలో వాటిని నివారించడం చాలా కష్టమైన పనే అని చెప్పచ్చు. అయితే కొన్ని మొక్కల్ని పెంచుకోవడం, సింపుల్ చిట్కాల్ని పాటించడం వల్ల ఈ కాలంలో చీమల బెడదను దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం రండి..వంటలకు అమోఘమైన రుచిని అందించే పుదీనా చీమల సమస్యను తగ్గించడంలో సహాయపడుతుందంటున్నారు నిపుణులు. ఈ మొక్క నుంచి వచ్చే సువాసన చీమలకు పడదట! అందుకే ఈ మొక్క ఉన్న ప్రదేశం దరిదాపులకు కూడా చీమలు రావంటున్నారు. కాబట్టి వంటగది కిటికీలు, బాల్కనీ, గార్డెన్. ఇలా పలు చోట్ల ఈ మొక్కను పెంచుకోవడం వల్ల ఇటు చీమల బెడద ఉండదు.. అలాగే ఆ ప్రాంతంలో పరిమళాలూ వెదజల్లుతాయి. తులసి మొక్క లేని ఇంటిని ఊహించుకోలేం. అయితే ఈ మొక్క నుంచి వచ్చే సువాసనను కూడా చీమలు తట్టుకోలేవట. అందుకే చీమల పుట్టలు, చీమల వరుసలు ఉన్న చోట ఈ ఆకుల్ని చల్లడం, ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఈ మొక్కను పెంచుకోవడం వల్ల సమస్య దూరమవుతుంది.. అలాగే చూడ్డానికి అందంగానూ కనిపిస్తుంది.




లావెండర్ మొక్క, దాన్నుంచి తయారుచేసిన నూనె గాఢమైన వాసన కలిగి ఉంటాయి. క్రిమికీటకాల్ని దూరం చేసే గుణాలు కూడా వీటిలో ఉన్నాయి. కాబట్టి లావెండర్ మొక్కను ఇంట్లో పెంచుకున్నా, ఈ నూనెను చీమల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతంలో స్ప్రే చేసినా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. చీమల బెడదకు చెక్ పెట్టడంలో రోజ్‌మేరీ మొక్కదీ కీలక పాత్రే అంటున్నారు నిపుణులు. ఇండోర్ ప్లాంట్స్‌గా వీటిని పెంచుకోవడం, గార్డెన్‌లో నాటుకోవడం, ఎండిపోయిన రోజ్‌మేరీ ఆకుల్ని కిచెన్ క్యాబినెట్స్‌లో, నిత్యావసరాలు నిల్వ చేసిన చోట ఉంచడం.. వంటివి చేస్తే ఆయా చోట్ల చీమల సమస్య తగ్గుముఖం పట్టే అవకాశం ఉందంటున్నారు. చీమల్ని తరిమికొట్టే సహజసిద్ధమైన సమ్మేళనాలు చామంతిలో ఉన్నాయంటున్నారు నిపుణులు. రంగురంగుల పూలతో పరిమళాల్ని వెదజల్లే ఈ మొక్కను ఇంట్లో, ఆరుబయట ఏర్పాటుచేసుకోవడంతో పాటు చీమల బెడద ఎక్కువగా ఉన్న ప్రదేశంలో ఈ పూలు అమర్చిన ఫ్లవర్‌వేజ్‌లను ఉంచడం వల్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందంటున్నారు. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏంటంటే – పైన పేర్కొన్న మొక్కలు ఇంట్లో ఉండడం వల్ల సాధారణంగా వాటి వాసనకు చీమలు వచ్చే అవకాశం తక్కువ. కానీ ఆయా మొక్కల పైన కొన్ని రకాల పురుగులు, కీటకాలు చేరినప్పుడు వాటిని తినడానికి చీమలు వచ్చే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అలాగే ఆయా కుండీల్లో మట్టి బాగా తడిగా ఉన్నా చల్లదనానికి చీమలు గూడు కట్టుకోవచ్చు. అందువల్ల కేవలం వీటి పైనే ఆధారపడడం కాకుండా ఇతరత్రా చిట్కాలను కూడా పాటించడం అవసరమంటున్నారు. నీళ్లు, వినెగర్ సమపాళ్లలో తీసుకొని.. కిచెన్ ప్లాట్‌ఫామ్, డైనింగ్ టేబుల్.. ఇలా చీమల బెడద పొంచి ఉండే ప్రదేశాల్ని ఈ మిశ్రమంతో తుడవాలి. తద్వారా ఫలితం ఉంటుంది. వంట చేసేటప్పుడు, భోజనం చేసేటప్పుడు.. ఆయా పదార్థాలు కిచెన్ ప్లాట్‌ఫామ్, డైనింగ్ టేబుల్, నేలపై పడిపోవడం వల్ల వాటి పైకి చీమలు చేరతాయి. ఇక అక్కడ్నుంచి ఇల్లంతా పాకుతాయి. కాబట్టి ఇంట్లో ప్రతి ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచడం ముఖ్యమంటున్నారు నిపుణులు.

కిటికీలు, తలుపుల మూలల్లో ఉండే రంధ్రాల ద్వారా చీమలు ఇంట్లోకి ప్రవేశిస్తుంటాయి. కాబట్టి ఆయా ప్రదేశాల్లో ప్రత్యేకమైన సిలికాన్ సీలెంట్‌తో మూసేయాలి. చీమల పుట్టలున్న చోట, రంధ్రాల వద్ద కాస్త దాల్చిన చెక్క పొడి లేదా కొన్ని లవంగాలు చల్లినా ఫలితం ఉంటుంది అంటున్నారు నిపుణులు. నిమ్మ సువాసనను కూడా చీమలు తట్టుకోలేవట! అందుకే చీమల పుట్టలు, రంధ్రాలున్న చోట నిమ్మరసం స్ప్రే చేయడం, నిమ్మతొక్కల్ని ఉంచడం మంచిదంటున్నారు నిపుణులు. చీమల బెడద ఎక్కువగా ఉన్న ప్రదేశంలో కాఫీ పొడి, కార్న్‌స్టార్చ్, బేకింగ్ సోడా.. వంటివి చల్లడం వల్ల కూడా ఫలితం ఉంటుంది అంటున్నారు. పెప్పర్‌మెంట్, టీట్రీ, యూకలిప్టస్.. వంటి నూనెల్ని ఆయా ప్రదేశాల్లో స్ప్రే చేయడం వల్ల కూడా చీమల బెడదను దూరం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు.

# గోళ్లు విరిగిపోతున్నాయా..?

శారీరక సౌందర్యంలో గోళ్లు కూడా ప్రధాన పాత్ర పోషిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే నెయిల్ ఆర్ట్, నెయిల్ జ్యుయలరీ.. అంటూ గోళ్లకు కూడా అదనపు సొబగులద్దుతుంటాం. ఈ క్రమంలో గోళ్లను అందంగా, ఆరోగ్యంగా ఉంచుకోవడం ఎంతో అవసరం. దీనికోసం కొన్ని సహజసిద్ధమైన చిట్కాలు ఉపయోగపడతాయంటున్నారు సౌందర్య నిపుణులు.



గోళ్లు పొడిబారినట్లు కనిపించడానికి తేమను కోల్పోవడం కూడా ఒక కారణం కావచ్చు. దీనివల్ల నిర్జీవంగా కనిపించడమే కాదు.. క్రమంగా పెళుసుబారడం, విరిగిపోవడం వంటి సమస్యలు కూడా ఎదురవుతాయి. కాబట్టి వాటికి తగినంత తేమను అందించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలో పెట్రోలియం జెల్లీ లేదంటే మాయిశ్చరైజర్‌ను గోరు మొదలు (క్యుటికల్) చుట్టూ పూసి, చేతులకు కాటన్ గ్లౌజుల్ని ధరించాలి. రాత్రంతా ఇలా ఉంచుకొని ఉదయాన్నే శుభ్రం చేసుకోవాలి. ఈవిధంగా తరచూ చేయడం వల్ల గోళ్లు తిరిగి తేమను సంతరించుకుంటాయట.

విరిగిపోతున్నాయా..?

గోళ్లు నిర్జీవమై, పొడిబారిపోయి విరిగిపోతున్నాయా? అయితే విటమిన్ 'ఇ' నూనెను తప్పనిసరిగా వాడాల్సిందే అంటున్నారు నిపుణులు. కొన్ని చుక్కల విటమిన్ 'ఇ' నూనెను గోరుపై, గోరు మొదట వేసి కాసేపు అలాగే ఉంచాలి. ఇలా క్రమంగా చేయడం వల్ల గోళ్లు ఆరోగ్యంగా, అందంగా మారతాయట. పొడిబారిన గోళ్లకు తిరిగి జీవం పోయడానికి ఆలివ్ నూనె ఎంతగానో దోహదం చేస్తుంది. ఈక్రమంలో కొద్దిగా ఆలివ్ నూనె తీసుకొని కనీసం పదిహేను నిమిషాల పాటు గోళ్లను అందులో ముంచి ఉంచాలి. ఇలా నెల రోజుల పాటు వారానికో సారి, తర్వాత వారానికి రెండుసార్లు చొప్పున చేయడం ద్వారా డ్యామేజ్ అయిన గోళ్లు తిరిగి జీవం పోసుకుంటాయి అంటున్నారు నిపుణులు.

# చల్లదనానికి మారేడు షర్బత్...


వేసవిలో చాలా చోట్ల బెల్ షర్బత్ (మారేడు జ్యూస్) కనిపిస్తుంది. ఇది శరీరాన్ని చల్లబరచడమే కాదు... మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఎండాకాలంలో జీర్ణక్రియ మందగించడం సహజం. ఇలాంటప్పుడు గ్లాసు మారేడు జ్యూస్ తాగితే సరి. ఈ పండులో ఉండే టానిన్, పెక్టిన్ అనే రసాయనాలు... మలబద్ధకం, విరేచనాలు గ్యాస్ట్రిక్ సమస్యలను అరికడతాయి. పేగులను శుభ్రపరిచి, జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి. అలానే, ఇందులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి వేసవిలో వచ్చే ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని రక్షించి, వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. ఈ కాలంలో శరీరంలో నీటి శాతం తగ్గిపోతుంది. దీన్ని నివారించడానికి ఓ గ్లాసు మారేడు రసం తాగి చూడండి.



ఇందులో పొటాషియం, ఇతర ఖనిజ లవణాలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్లు అందుతాయి. దీంతో డీహైడ్రేషన్ ఎదురుకాదు. అంతేకాదు, ఈ షర్బత్ తాగితే... అలర్జీలు, దద్దుర్లు రావట. మొటిమలు కూడా అదుపులో ఉంటాయి. రక్త శుద్ధి జరిగి చర్మం కూడా సహజంగా మెరుస్తుంది. బాగా పండిన మారేడు పండును తీసుకుని పగలగొట్టాలి. స్పూన్‌తో లోపల ఉన్న గుజ్జును వేరు చేసి ఒక గిన్నెలో వేయాలి. అందులో తగినన్ని నీళ్లు పోసి గంట పాటు నానబెట్టాలి లేదా చేత్తో బాగా మెదిపి జల్లెడతో గింజలు, పీచును వేరు చేసి రసాన్ని వడకట్టాలి. ఇందులో కొద్దిగా బెల్లం లేదా తేనె, చిటికెడు మిరియాల పొడి... కలిపి చల్లగా సర్వ్ చేసుకోవాలి. మారేడు రసం అమృతం లాంటిదే అయినప్పటికీ, డయాబెటీస్ ఉన్నవారు చక్కెర లేదా బెల్లం కలపకుండా వైద్యుల సలహాతో తీసుకోవడం మంచిది. అలాగే, గర్భిణులు పరిమితంగా తీసుకోవాలి.

# సంతాన భాగ్యం కోసం..!

మాతృత్వం కోసం ఎంతగానో పరితపిస్తుంటారు మహిళలు. కానీ అనారోగ్యకరమైన జీవనశైలి, ప్రత్యుత్పత్తి వ్యవస్థలో సమస్యల కారణంగా కొంతమంది మాతృత్వానికి దూరమవుతున్నారు. ఈ క్రమంలో మనం తీసుకునే ఆహారంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా గర్భం ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుందంటున్నారు నిపుణులు. అందుకే పోషకాలతో నిండి ఉన్న పదార్థాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోమని సలహా ఇస్తున్నారు. గర్భం ధరించాలంటే అండం విడుదలవడం ఎంత ముఖ్యమో..




దాని నాణ్యత కూడా అంతే ముఖ్యం. అయితే మన శరీరంలో ఉండే ఫ్రీ రాడికల్స్ అండాశయాల్లో ఉత్పత్తయ్యే అండాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. మరి, ఆ సమస్యను తగ్గించుకోవాలంటే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోమని సలహా ఇస్తున్నారు నిపుణులు. ఈ క్రమంలో 'సి', 'ఇ' విటమిన్లు, ఫోలేట్, బీటా కెరోటిన్, ల్యూటిన్.. వంటి యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కాయగూరలు, నట్స్, ధాన్యాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. పురుషుల్లో వీర్యకణాల నాణ్యత పెంచుకోవాలన్నా ఇదే సూత్రం వర్తిస్తుంది. ఇలా అండం, వీర్యకణాల నాణ్యత పెరిగితే గర్భం ధరించే అవకాశాలు చాలావరకు మెరుగుపరచుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు.

ఆ 'కొవ్వులు' వద్దు!

చెడు కొవ్వులు (ట్రాన్స్ ఫ్యాట్స్) రక్తంలో ఇన్సులిన్ స్థాయుల్ని పెంచి అండోత్పత్తి, గర్భధారణపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. కాబట్టి ఇవి ఎక్కువగా ఉండే బేకరీ ఐటమ్స్, ఫ్రైడ్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు.. వంటి వాటికి దూరంగా ఉండాలి. ఇక 'ఎ', 'డి', 'ఇ', 'కె', 'కె2'.. వంటి విటమిన్లు అధికంగా లభించే పాలు, పాల పదార్థాలు తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఇందులో ఉండే మంచి కొవ్వులు సంతాన సమస్యల్ని క్రమంగా దూరం చేసి గర్భధారణను ఫలవంతం చేస్తాయట! పీసీఓఎస్ ఉన్న వారిలో అధిక బరువు, ఇర్రెగ్యులర్ పిరియడ్స్.. వంటివి సంతాన లేమికి కారణమవుతాయి. అయితే ఈ సమస్యల్ని తగ్గించుకొని పీసీఓఎస్‌ను అదుపు చేసుకోవాలంటే తీసుకునే ఆహారంలో తక్కువ కార్బోహైడ్రేట్లు ఉండేలా జాగ్రత్తపడాలంటున్నారు నిపుణులు. తద్వారా శరీరంలో ఇన్సులిన్ స్థాయులు అదుపులో ఉంటాయి.. నెలసరి కూడా క్రమంగా వస్తుంది.. పీసీఓఎస్ కంట్రోల్ అవుతుందంటున్నారు నిపుణులు.

# సౌందర్య సంరక్షణకూ 'తులసి'!


మచ్చలేని సౌందర్యాన్ని సొంతం చేసుకోవడానికి మార్కెట్లో లభించే వివిధ సౌందర్య ఉత్పత్తులే కాదు.. సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడతాయి. మన ఇంట్లో ఉండే తులసి ఆకులు కూడా ఇదే కోవకు చెందుతాయి అంటున్నారు నిపుణులు. తులసి ఆకులను నీటిలో ఉడికించి చల్లార్చి ఆ ద్రావణాన్ని టోనర్‌గా కూడా వాడుకోవచ్చు. దీనివల్ల మొటిమలు తగ్గడమే కాదు.. ముఖం కాంతివంతంగా మారుతుందట.



తులసి పొడిని రోజ్ వాటర్‌తో కలిపి ముఖానికి పట్టిస్తే చర్మ రంధ్రాలు శుభ్రపడి మొటిమలు, ఇతర చర్మ సంబంధిత సమస్యలు క్రమంగా తగ్గుముఖం పడతాయట. తులసి ఆకుల రసానికి పుదీనా ఆకుల రసం కలిపి ముఖానికి పట్టిస్తే మొటిమల నుంచి ఉపశమనం కలుగుతుందంటున్నారు నిపుణులు. ముఖంపై నల్ల మచ్చలను నివారించడంలో తులసి బాగా పని చేస్తుంది. తులసి ఆకుల రసానికి కొంచెం నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించాలి. అరగంట తర్వాత చల్లని నీటితో కడగాలి. ఇలా చేయడం వల్ల ముఖంపై ఉన్న నల్ల మచ్చలు తగ్గడంతో పాటు చర్మం కాంతివంతంగా మారుతుందంటున్నారు నిపుణులు.

# జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే..!


ఒత్తైన, నల్లని కురులు కావాలని అందరూ కోరుకుంటారు. ఇందుకోసం వివిధ రకాల కేశ సంబంధిత ఉత్పత్తులను వాడుతుంటారు. మరోవైపు ఇంటి చిట్కాలూ పాటిస్తుంటారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. ఆహారం విషయంలో మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. ఈ నిర్లక్ష్యమే కురుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని చెబుతున్నారు సౌందర్య నిపుణులు. ఈ క్రమంలో– జుట్టు ఆరోగ్యాన్ని పెంపొందించే కొన్ని పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. బెర్రీ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇందులోని విటమిన్ 'సి' కొలాజెన్ ఉత్పత్తికి, శరీరం ఐరన్‌ను గ్రహించడానికి తోడ్పడుతుంది. ఫలితంగా జుట్టు ఒత్తుగా పెరుగుతుందట. ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు తినడం వల్ల జుట్టు సమస్యలు తగ్గిపోయి.. ఒత్తైన, నల్లని కురుల్ని సొంతం చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. చిలగడదుంపల్లో ఉండే విటమిన్ 'ఎ' కుదుళ్లలో సీబమ్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఫలితంగా కుదుళ్లు పొడిబారిపోకుండా జాగ్రత్తపడచ్చు. 'బి', 'ఇ' విటమిన్లతో పాటు జింక్, ఇతర అత్యవసర ఫ్యాటీ ఆమ్లాలు నిండిన నట్స్ జుట్టు ఎదుగుదలను ప్రేరేపిస్తాయి. ఇక గింజల్లో ఉండే ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు జుట్టు ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఆకుకూరల్లో ఫోలేట్, ఐరన్, 'ఎ', 'సి' విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కుదుళ్లను దృఢంగా చేసి జుట్టు ఒత్తుగా పెరిగేలా చేస్తాయి అని సూచిస్తున్నారు నిపుణులు.



# వుదయం సినిమా

MOVIE TIME

## అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ 'పురుష:'



## మెగాస్టార్ చిరు




## న్యూ-ఏజ్ రొమాంటిక్ కామెడీ మూవీ ఘనంగా ప్రారంభం






## జరుగుతున్న పోస్ట్-ప్రొడక్షన్ వర్క్స్









## హీరోయిన్ అనన్య నాగళ్ళ





## ధనుష్ 'కర' సినిమా ఏప్రిల్ 30న తెలుగులో భారీ ఎత్తున రిలీజ్



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.